# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 278 | హైదరాబాద్ | గురువారం 30-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

## తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలోకి
# హైదరాబాద్ మెట్రో రైల్

- ఎల్ అండ్ టీతో పూర్తయిన ఒప్పందం
- రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ
- మెరుగ్గా మెట్రో విస్తరణ పనులు, ప్రణాళిక, సేవలు

11లో





## తెలంగాణలో ఇంధన కొరత లేదు
# మంత్రి ఉత్తమ్ స్పష్టత


11లో

- ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి
- అసాధారణ డిమాండ్ కారణంగా బంకుల్లో ఖాళీ అవుతున్న స్టాక్
- సరఫరాను 126 శాతానికి పెంచి పరిస్థితిని చక్కదిద్దుతున్నామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులకు, లారీ యజమానులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు

## గంగా ఎక్స్‌ప్రెస్‌వే
# యూపీ ప్రగతికి నూతన పథం

- ఉత్తరప్రదేశ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ. 36,230 కోట్ల వ్యయంతో 594 కిలోమీటర్ల పొడవున 6 లేన్ల రహదారి నిర్మాణం
- మీరట్‌ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గింపు
- యూపీ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కొత్త జీవనాడిగా మారుతుందని ప్రధాని వ్యాఖ్య
- షాజహాన్‌పూర్ జిల్లాలో 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ స్ట్రిప్ ఏర్పాటు

11లో





## ట్రంప్ చేతిలో గన్..
# ఇరాన్‌కు చెక్!


- చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించడం లేదని విమర్శ
- అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని వ్యాఖ్య
- ఈ విషయంలో వారు తెలివిగా వ్యవహరిస్తే బాగుంటుందన్న ట్రంప్

11లో

## ఎగ్జిట్ పోల్స్
# మూడు రాష్ట్రాల్లో ఉత్కంఠ

- కేరళలో యూడీఎఫ్, ఎల్డీఎఫ్ మధ్య హోరాహోరీ తప్పదన్న సర్వేలు
- తమిళనాడులో డీఎంకే కూటమికి అధిక స్థానాలు, విజయ్ పార్టీకి గణనీయ ఓట్లు
- పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీ మధ్య తీవ్ర పోటీని అంచనా వేసిన ఎగ్జిట్ పోల్స్
- వివిధ సర్వే సంస్థల అంచనాల్లో భారీ తేడాలతో పెరిగిన ఉత్కంఠ
- బెంగాల్‌లో కొన్ని సర్వేలు బీజేపీకి, మరికొన్ని తృణమూల్‌కు పట్టం

11లో




## మోదీ హైదరాబాద్ సభకు
# 'జనాగ్రహ సభ'గా నామకరణం

- మే 10న తెలంగాణలో పర్యటించనున్న మోదీ
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ
- 3 లక్షల మందిని సభకు తరలించే లక్ష్యంలో బీజేపీ శ్రేణులు

11లో






## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా
# నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

- లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించిన చంద్రబాబు
- ప్రమాణస్వీకారం చేసిన పొలిట్ బ్యూరో, ఇతర కమిటీల నేతలు
- మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమం

11లో



## కవితకు టీఆర్ఎస్ షాక్
# ఈసీకి లేఖ!

- ఈసీకి తెలంగాణ రాజ్య సమితి అధ్యక్షుడి లేఖ
- 2023లోనే తెలంగాణ రాజ్య సమితి (టీఆర్ఎస్)ని రిజిస్టర్ చేయించినట్లు వెల్లడి
- టీఆర్ఎస్ పేరుతో మరో పార్టీని రిజిస్టర్ చేస్తే తనకు నష్టం జరుగుతుందని వెల్లడి

11లో

# ఆప్...సోపాలు

ఒకప్పుడు ఆమ్‌ఆద్మీ పార్టీ పేరు వింటే చాలు, సగటు మనిషి ఛాతీ గర్వంతో మరో రెండు అంగుళాలు విశాలమయ్యేది. అవినీతిని అంతమొందించడంలో, ప్రజారంజకమైన పాలన అందించడంలో ఆ పార్టీ ముందుంటుందన్న ధైర్యం వారిలో అడుగడుగునా కనబడేది. కానీ, పద్నాలుగేళ్ళు తిరిగేసరికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవినీతి కూపంలో నిండా మునిగిపోయి, ఊపిరాడక సతమతమవుతున్న ఆ పార్టీ సగటు మనిషికి ఏనాడో దూరమైంది. ఈ పరిస్థితికి కొంతవరకూ ఆ పార్టీ అధినేత కారణం కాగా, మరికొంత కేంద్రంలో చక్రం తిప్పుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కారణం. ఈ మిత్రద్వయం తరచూ వేస్తున్న ఎత్తుగడలకు చిత్తవడం కేజ్రీ వంతవుతోంది. మద్యం కుంభకోణం కేసులు బనాయించి, ముఖ్యమంత్రినే అరెస్ట్ చేయించి, ఆ కేసుల ఆధారంగా పార్టీ పెద్దలపై అవినీతి ముద్ర వేసి, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ కమలనాథులు అంతటితో ఆగలేదు. రాజ్యసభ సభ్యులైన ఏడుగురు ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలను తమవైపు తిప్పుకుని, బిజెపిలో విలీనం చేసుకోవడం తాజా పరిణామం. ఢిల్లీ మద్యం కేసులో సిబిఐ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో రాబోయే పంజాబ్ ఎన్నికల్లో గెలుపు తమదేనని సంతోషిస్తున్న కేజ్రీవాల్‌కు ఆ సంబరం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. నిన్నటివరకూ తనకు, పార్టీకి కుడిభుజంలా నిలబడినవారు సైతం అకస్మాత్తుగా ఇలా 'ఫిరాయించడం'తో కేజ్రీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆమ్‌ఆద్మీ పార్టీ పెట్టకముందునుంచీ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా మెలగిన రాఘవ్ చద్దా, స్వాతి మలీవాల్ వంటివారు సైతం బిజెపి గూటికి చేరిపోవడం వింతల్లోకెల్లా వింత. రాజ్యసభలో తమ బలాన్ని పెంచుకోవడం, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో పాగా వేయడం లక్ష్యంగా మోడీ, షా ద్వయం తాజా వ్యూహానికి తెర తీశారన్నది విస్పష్టం. ఆప్ ఎంపిల చేరికతో రాజ్యసభలో బిజెపి సభ్యుల బలం 113కి చేరగా, ఎన్‌డిఎ బలం 146కు పెరిగింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) లో లొసుగులను ఆసరా చేసుకుని ఇలా ఇతర పార్టీల సభ్యులకు ఎర వేసినందుకు మోడీ, అమిత్ షాలను తప్పుబట్టడంలో తప్పేమీ లేదు. అయితే, ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉంటూ, పదేళ్లపాటు ఢిల్లీని పాలించి చాలినంత రాజకీయ, పాలనా అనుభవం గడించి కూడా.. ప్రత్యర్థుల ఎత్తుగడలను చివరిదాకా పసిగట్టలేకపోయినందుకు కేజ్రీవాల్‌నూ అంతే తప్పుపట్టాలి. ప్రాంతీయ పార్టీల పొడ అసలే గిట్టని భారతీయ జనతా పార్టీ పెద్దలు, వాటి ఊపిరి తీసేందుకు ఎంతకైనా తెగిస్తారనేది గత చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది. దేశ రాజధానిలో తిష్ఠవేసుకుని కూర్చుని, తమకు పక్కలో బల్లెంలా మారిన ఆప్‌ను అంతమొందించాలన్నది మోడీ, అమిత్ షాల చిరకాల వాంఛ. అందులో చాలావరకూ కృతకృత్యులయ్యారన్నది ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతోనే రుజువైంది. ఇక పంజాబ్ లోనూ ఆప్‌ను అధికారంనుంచి దింపడమే లక్ష్యంగా కేజ్రీవాల్ ఆరోపించినట్లు 'ఆపరేషన్ లోటస్'కు తెరతీశారు. మునుపటి ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్ విజ యం వెనుక కీలకపాత్ర పోషించిన రాఘవ్ చద్దాకు గాలం వేయడం అందులో భాగమే. అగ్నికి ఆజ్యం తోడైనట్లు, బిజెపి నేతల ఎత్తుగడలకు కేజ్రీవాల్ స్వయంకృతాపరాధాలు తోడయ్యాయి. అవినీతిని అంతం చేస్తానని నమ్మబలికిన ఆప్ అదే అవినీతికి ఆలవాలమైందన్న బిజెపి పెద్దల ఆరోపణలకు కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని తలదన్నుతూ కట్టుకున్న ఇల్లు, మద్యం కుంభకోణం వంటివి బలం చేకూర్చాయి. ఇప్పటికైనా మించింది లేదు. తమ పార్టీ నేతలు మరికొందరు చేజారకముందే ఆప్ అధినేత జాగ్రత్తపడటం మంచిది. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టేలా పదునైన వ్యూహాలను రచించగలగాలి. కొన్నేళ్లుగా పంజాబ్ లో పలువురు ఆప్ నాయకులను బిజెపి నయానో భయానో తమవైపు తిప్పుకోగలిగింది. ఈ తెలివిడి, రాజకీయ చతురత లేకనే ఆప్ అగ్రనేతలు ప్రత్యర్థులు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం భారత రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా బీజేపీలో చేరిక. ఆప్ కీలక నేతగా పేరున్న రాఘవ్, అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ నిర్ణయం వెనుక కారణాలపై పలు ఊహాగానాలు చెలరేగుతుండగా, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాఘవ్ చద్దా బీజేపీలో చేరడానికి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. "రాఘవ్ చద్దా తన సోదరి పరిణీతి చోప్రా భర్త కావడంతో ఆయనను కాపాడుకోవడానికి ప్రియాంక ఈ నిర్ణయం తీసుకున్నారు" అని కౌర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రాఘవ్ వెనుక పడ్డారని, త్వరలోనే ఆయనపై ఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రియాంకకు ముందే సమాచారం అందిందని ఆమె వెల్లడించారు. అందుకే తన చెల్లెలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాఘవ్‌ను బీజేపీ వైపు మళ్లించారని కౌర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, రాఘవ్ చద్దాకు ఆప్ అధిష్టానానికి మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని నవజ్యోత్ కౌర్ సిద్ధూ వివరించారు. పార్టీ కోసం రాఘవ్ సరిగా మాట్లాడటం లేదని ఆప్ నాయకత్వం భావించిందని, ఆ కారణంగానే వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆమె తెలిపారు. ఏదైనా తప్పు జరిగినప్పుడు అప్పుడే గళం విప్పాలని, నాలుగేళ్ల తర్వాత మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజకీయ మార్పు రాఘవ్ చద్దా సోషల్ మీడియా ఇమేజ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బీజేపీలో చేరిన మరుసటి రోజే ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలకు పైగా (రెండు మిలియన్లు) ఫాలోవర్లను కోల్పోయారు. ఆప్ తన వ్యవస్థాపక సూత్రాలు, సిద్ధాంతాల నుంచి దూరంగా వెళ్లడంతో తాము బీజేపీలో విలీనమయ్యామని మీడియా సమావేశంలో చద్దా వెల్లడించారు. ఆప్ కోసం 15 ఏళ్లు నా రక్తం, చెమట ధారపోశాను.. సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పార్టీ పూర్తిగా పక్కకు తప్పుకుంది" అని ఆయన అన్నారు. "రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చు" అని తమ పార్టీలోని 10 మంది ఎంపీల బలాన్ని ప్రస్తావిస్తూ చద్ధా తెలిపారు. "వారు ఇప్పటికే సంతకాలు చేశారు.. ఈ ఉదయం మేము సంతకాలు చేసిన లేఖలు, ఇతర పత్రాలతో సహా అవసరమైన అన్నింటిని రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించడం... విలీనానికి అనుమతించడం చకచకా జరిగిపోయాయి. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పుట్టిన ఆప్.. 14 ఏళ్ల తర్వాత పార్టీ చరిత్రలోనే అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. సినీ ప్రముఖులు కునికా సదానంద్, ప్రకాష్ రాజ్ వంటి వారు కూడా రాఘవ్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన ఈ కీలక వ్యాఖ్యలపై ఇప్పటివరకు ప్రియాంక చోప్రా, పరిణీతి చోప్రా లేదా రాఘవ్ చద్దా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే, ఈ నిర్ణయం వెనుక నిజంగా ఇదే కథ ఉందా అనే ప్రశ్న ప్రజల్లో మొదలైంది. రాఘవ్ చద్దా రాకతో బీజేపీ బలం పెరుగుతుందా లేదా ఆమ్ ఆద్మీ పార్టీ దెబ్బతింటుందా అనేది వేచి చూడాలి. ఒకవైపు పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూ, మరోవైపు ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేసేలా రాజకీయ వ్యూహరచన చేయగలిగితేనే పంజాబ్‌లో ఆప్ అధికారాన్ని నిలుపుకునేది. మద్యం కుంభకోణ కేసులో సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును, తాజాగా తమ పార్టీ ఎంపిల విలీనం ఉదంతాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకువెళ్లగలగాలి. లేదంటే జాతీయ పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆమ్‌ఆద్మీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా పోయే పరిస్థితి దాపురిస్తుంది.

# మారని తమ్ముళ్లు...

విజయవాడ ఏప్రిల్ 29,

ఒకరి తర్వాత మరొకరు. ఒక ఇష్యూ తర్వాత మరో రచ్చ. ఎమ్మెల్యేలే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో..లేక వివాదాలే వాళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయో తెలియదు కాని.. ప్రతి నెల రోజులకో ఎమ్మెల్యే తీరు ఇష్యూ అవుతోంది. టీడీపీ అధినేతకు హెడెక్ అవుతోంది. పర్సనల్ లైఫ్ వేరు. పబ్లిక్ లైఫ్ చాలా సున్నితమైంది. ప్రజా జీవితంలో ఉన్న నేతలు..వారి చుట్టున్న వాళ్లు చిన్న మిస్టేక్ చేసిన పెద్ద రచ్చ అవుతోంది. పొలిటికల్ లైఫే తలకిందులైన సందర్భాలు ఉన్నాయి. అందుకే చేసే ప్రతీ..మాట్లాడే ప్రతీ మాట ఎంతో ముఖ్యం. రాజకీయ నాయకులు అయితే ఎంత జాగ్రత్తగా ఉంటే అంత బెటర్. ఎంత ఆచితూచి వ్యవహరిస్తే అంత మంచిది. దూకుడే పేరు తెచ్చి పెట్టినా..ఆ దూకుడు స్వభావమే నట్టేట ముంచొచ్చు. సింపుల్ లివింగ్, లో ప్రొఫైల్..హై థింకింగ్‌కు అలవాటు పడిన వారికే బెటర్ పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందన్నది..సీనియర్ లీడర్లను చూస్తే అర్థమవుతోంది. ఎమ్మెల్యేలు సరిగ్గా ఉంటే సరిపోదు..వారి కుటుంబ సభ్యులు, అనుచరులు, సిబ్బంది అందరి ప్రవర్తన లెక్కలోకి వస్తుంది. చివరకు ఎమ్మెల్యేతో ఫోటో దిగిన వ్యక్తి ఏదైనా తప్పు చేసి దొరికినా..అది ఆ ప్రజాప్రతినిధి మెడకు చుట్టుకోవడం ..ఆయన సమాధానం చెప్పుకునే పరిస్థితులకు దారితీస్తుంది.ఏ పొలిటికల్ లీడర్ అయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే..తాము చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని. అది పబ్లిక్ మీటింగ్‌లో కావొచ్చు. రోడ్డు మీద కావొచ్చు. ఎక్కడైనా ప్రవర్తన చాలా ముఖ్యం. ఎప్పుడూ ఏ రూపంలో వివాదంలో చిక్కుకోవాల్సి వస్తుందో చెప్పలేమ్. ఏ మాత్రం టంగ్ స్లిప్ అయినా..ఎక్కడ తమ బిహేవియర్ డిఫరెంట్‌గా కనిపించినా..మీడియా, సోషల్ మీడియా చెడుగుడు ఆడేస్తుంది. ఆ తర్వాత ఎన్ని వివరణలు ఇచ్చుకున్నా..ఎన్ని కవర్ డ్రైవ్‌లు చేసినా డ్యామేజ్ కంట్రోల్ అవడం కష్టం. ఒక ఎమ్మెల్యే చేసే మిస్టేక్ ఆయనకే పరిమితం కాదు. ఓవరాల్ పార్టీకి బ్యాడ్‌నేమ్ తెస్తున్న పరిస్థితి.టీడీపీ ఎమ్మెల్యేల విషయంలో సీన్ మరోలా ఉంది. ఎప్పుడూ ఎవరో ఒక ఎమ్మెల్యే వివాదాల్లో చిక్కుకోవడం..సీఎం చంద్రబాబు సీరియస్ అవడం కామన్ అయిపోయింది. అందరిదీ ఒక కథ అయితే..కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎపిసోడ్ సమ్‌థింగ్ డిఫరెంట్. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే అయిన సురేంద్రబాబుకు నియోజకవర్గంలో మంచి పేరే ఉందంటున్నారు తెలుగు తమ్ముళ్లు . ఆయన ఎలాంటి కాంట్రవర్సీలు, అనవసర విషయాలకు జోలికి వెళ్లరని చెప్తున్నారు. కానీ టోల్ ప్లాజా ఎపిసోడ్‌లో ఆయన అనుచరులు చేసిన వీరంగం పెద్ద రచ్చ అయింది. చివరకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రియాక్ట్ అయి కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించే వరకు వచ్చింది.టోల్ గేట్ దగ్గర ఏం జరిగింది.. తప్పు ఎవరిదన్న విషయం పక్కన పెడితే జరగాల్సిన ఇష్యూ జరిగింది. టీడీపీ, కూటమి ప్రభుత్వంపై విమర్శలు రావడం..డ్యామేజ్ కంట్రోల్ కోసం చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. అయినా చర్చకు, విమర్శకు అవకాశం ఇచ్చినట్లు అయింది. ఇక్కడ ఎమ్మెల్యే విషయంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేకున్నా..ఆయన ముందే టోల్ గేట్ సిబ్బందిపై అనుచరులు దాడి చేశారన్న వార్తలు తీవ్ర విమర్శలకు దారితీశాయి.సీఎం చంద్రబాబు పదేపదే ఎమ్మెల్యేలకు సూచిస్తున్నది ఇదే. పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. చిన్న ఇష్యూనే కదా ఏం కాదు అనుకుంటే కుదరదు అంటూ పదే పదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రజాప్రతినిధుల బిహేవియర్ చాలా ఇంపార్టెంట్. జనం మన ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారన్న విషయం గుర్తు చేస్తూనే ఉన్నారు. అయినా అక్కడక్కడ ఎమ్మెల్యేలు..పొరపాటుగానో..కావాలనో రచ్చకెక్కడం, ఇష్యూకు తెరలేపడం రెగ్యులర్ అయిపోయింది. అనవసర విషయాలు, కాంట్రవర్సీల్లో వేలు పెడుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇప్పటికే పలుసార్లు సీరియస్ అయిన సీఎం చంద్రబాబు..ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు నాటికి కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# తీరనున్న కనిగిరి ప్రాంత వాసుల కల

ఒంగోలు, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)

పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లావాసులు.. ముఖ్యంగా కనిగిరి ప్రాంత ప్రజల కలనెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైలు సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. గుంటూరు నుంచి కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారంలో ఆరు రోజుల పాటూ రైలును నడిపేలా ప్రతిపాదించారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం అవుతున్నాయి. పాత ప్రాజెక్టులతో పాటుగా కొత్త ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. రాష్ట్రంలో కీలకమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుతం మార్కాపురం జిల్లా కనిగిరి వరకు పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పామూరు వైపుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కనిగిరి వరకు రైల్వే లైన్ పనులు పూర్తికావడంతో అక్కడి వరకు రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో పాటుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. రైల్వేశాఖకు విన్నవించారు.కనిగిరివాసుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసే దిశగా ఓ ముందడుగు పడింది. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. గుంటూరు నుంచి గుండ్లకమ్మ మీదుగా కనిగిరి వరకు ఈ రైలును నడిపేందుకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 24న ఆ వివరాలు అధికారుల దగ్గరకు చేరాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వారంలో ఆరు రోజుల పాటూ గుంటూరు నుంచి కనిగిరి వరకు ఈ కొత్త సర్వీస్‌ను నడపాలని ప్రతిపాదించారు. ఈ ప్యాసింజర్ రైలు గుంటూరులో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు కనిగిరి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు కనిగిరి నుంచి బయల్దేరి రాత్రి 7 గంటలకు గుంటూరు చేరుకునేలా ప్లాన్ చేశారు. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు రైలును నడపాలని గతంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇటీవల రైల్వే అధికారుతో మాట్లాడటంతో సానుకూలంగా స్పందించారు. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తికావడం, ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందబాటులోకి రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేయడంతో.. కొత్తగా ప్యాసింజర్ రైలును కనిగిరి వరకు నడిపేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయినట్లేనని చెబుతున్నారు. కనిగిరి నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైతే ఆ ప్రాంతం నుంచి రాజధాని ప్రాంతమైన గుంటూరుకు కనెక్టివిటీ కూడా పెరుగుతుందంటున్నారు. కనిగిరి మాత్రమే కాదు పొదిలి, దర్శి ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మొత్తం మీద మార్కాపురం, పశ్చిమ ప్రకాశం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది.

# పాత బస్సులకు కొత్త రంగులు...

విజయవాడ ఏప్రిల్ 29

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర విద్యుత్ వాహన పాలసీ 4.ా కింద ఆర్టీసీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో డీజిల్ ఖర్చు తగ్గించి కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ బస్సుల్ని తీసుకొస్తోంది. కేంద్రం నుంచి 1050 బస్సులు కేటాయించగా.. మరో 1450 బస్సుల్ని తీసుకురావాలని నిర్ణయించింది. అంతేకాదు కాలం చెల్లిన పాత బస్సుల్ని రీమోడల్ చేసి విద్యుత్ బస్సులుగా మార్చేస్తోంది. పాత డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు.ఆర్టీసీలో పాత బస్సులు కొన్ని లక్షల కిలోమీటర్లు తిరిగి ఉంటాయి.. ఈ కాలం చెల్లిన బస్సును ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద రెట్రోఫిట్‌మెంట్ చేసి, విద్యుత్‌తో నడిచే ఏసీ బస్సుగా మార్చేశారు. పాత సూపర్ లగ్జరీ బస్సును కళ్యాణీ ట్రాన్స్ సంస్థ (భారత్ ఫోర్జ్) ప్రయోగాత్మకంగా విద్యుత్ ఏసీ బస్సు (ఇంద్ర సర్వీస్)గా మార్చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సును విజయవాడ ఆర్టీసీ హౌస్‌కు తీసుకురాగా అధికారులు పరిశీలించారు. ఈ బస్సును కొంతకాలం ట్రయల్ రన్ కోసం ఏదైనా రూట్‌లో నడపాలని నిర్ణయించారు. ఈ బస్సుకు ఎంతసేపు ఛార్జింగ్ చేస్తే ఎన్ని కిలోమీటర్లు మైలేజ్ వస్తుందో పరిశీలించనున్నారు. పాత బస్సుల్ని ఇదే తరహాలో రెట్రోఫిట్‌మెంట్ చేస్తే ఎంత ఖర్చవుతుంది?.. కొత్త విద్యుత్ ఏసీ బస్సులు తీసుకోవడం కంటే.. ఇలా పాత వాటిని మార్పు చేస్తే ఎంత ఖర్చువుతుంది? వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే చిత్తూరు ఆర్టీసీ డిపోలో డీజిల్ బస్సును సీఎన్జీ బస్సుగా మార్చేశారు.. ఇప్పటికే ఈ బస్సు ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ఇప్పుడు పాత బస్సుల్ని విద్యుత్ బస్సులుగా మార్చేస్తున్నారు.మరోవైపు ఏపీఎస్‌ఆర్టీసీకి ఎలాంటి డీజిల్ కొరత లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 11 వేల బస్సులకు రోజుకు 7.5 లక్షల లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.. అయితే ప్రస్తుతం అన్ని బస్సు సర్వీసులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన డీజిల్ విషయంలో ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని అధికారులు తెలిపారు

# గుజరాత్ కమలానిదే...

గాంధీనగర్, ఏప్రిల్ 29,

గుజరాత్ లో బీజేపీ తన పట్టును నిలుపుకుంది. అక్కడ జరిగిన స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. మొత్తం 15 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా.. 15 కార్పొరేషన్లూ బీజేపీ కైవసం చేసుకుంది. దీంతో గుజరాత్ లో బీజేపీదే బలం అని మరోసారి రుజువు చేసినట్లైంది. ఇక.. కాంగ్రెస్, ఆప్ పత్తా లేకుండా పోయాయి. కనీసంలో కనీసం నామ మాత్రపు పోటీ కూడా ఇవ్వలేకపోయాయి. మొత్తం 1,044 సీట్లుండే 15 మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ 856 సీట్లను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుంది. ఇక ఇతరులు 12 స్థానాల్లో విజయం సాధించారు.రాజ్‌కోట్‌లో బీజేపీ పనితీరు కూడా అత్యంత ఆకట్టుకునేలా సాగింది; మున్సిపల్ కార్పొరేషన్‌లోని 72 స్థానాలకు గాను ఆ పార్టీ 65 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ కేవలం 7 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఇక్కడ కనీసం తన ఖాతాను కూడా తెరవలేకపోయింది. ఇంతలో, రాజ్‌కోట్ జిల్లా పంచాయతీలోనూ బీజేపీ 36 స్థానాలకు గాను 34 స్థానాలను గెలుచుకుని ప్రతిపక్షాల ఉనికినే ప్రశ్నార్థకం చేసింది.ఇక.. అహ్మదాబాద్ లోని 192 స్థానాలకు గానూ బీజేపీ 158 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 22 స్థానాలను గెలుచుకుంది. సూరత్ లో 120 స్థానాలుంటే బీజేపీ 115 స్థానాల్లో గెలుపొందగా, ఆప్ 4 స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ మాత్రం ఒకే ఒక్క స్థానానికే పరిమితమైంది.రాజ్ కోట్, వడోదరా, భావ్ నగర్ లో బీజేపీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. రాజ్ కోట్ లో 72 స్థానాలకు గాను బీజేపీ 65, కాంగ్రెస్ 7 స్థానాలను, వడోదరాలో 76 వార్డులకు గానూ బీజేపీ 69, కాంగ్రెస్ 6 వార్డుల్ని గెలుచుకుంది.

# ఆకివీడు రామాలయం అడుగులు


ఏలూరు, ఏప్రిల్ 29,

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని పెదపేటలో శ్రీరామ నవమి కూటమి నేతలు, రామభక్తులపై దాడి ఘటన కలకలం రేపింది. మార్చి 8న పెదపేటలో రామాలయం పునరుద్ధరణ చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కొందరు స్థానికులు మార్చి 17న కొంతమంది గొంతెనమ్మ ఆలయం పేరుతో ఫ్లెక్సీ కట్టారు. ఆ తర్వాత మార్చి 27న శ్రీరామనవమి రోజు రఘురామ పూజల కోసం వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కూటమి నేతలతో పాటుగా మరికొందరిపై దాడులు జరిగాయి.. ఈ కేసులో 58మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో నిందితుడిగా ఉన్న భీమవరానికి చెందిన మీసాల జయరాజు జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా ఆకివీడు పెదపేట ఘటనకు సంబంధించి సంచలన విషయాలను వెల్లడించారు. పెదపేటలో వివాదం, గొడవల వెనుక పాస్టర్ ఇస్మాయిల్ పాత్ర ఉందంటూ చెప్పుకొచ్చారు.ఆకివీడులో శ్రీరామనవమి రోజు జరిగిన ఘటనలో తనపై కూడా కేసు నమోదైందని జయరాజు చెప్పుకొచ్చారు. తనపై కూడా ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేయడంతో జైలకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. పెదపేటలో చర్చిలు కూల్చివేసి దళితులపై దాడిచేసి ఇళ్లు కూల్చి వేస్తున్నారని పాస్టర్ ఇస్మాయిల్ తనకు ఫోన్ చేశారని.. శాంతియుత ర్యాలీ చేయాలని చెప్పడంతో ఒక దళిత నాయకుడిగా తాను అక్కడికి వెళ్లానన్నారు. ఆ రోజే ఇస్మాయిల్ అనే వ్యక్తి మొదటిసారి పరిచయం అయ్యారని చెప్పుకొచ్చారు.శాంతియుత ర్యాలీ అని చెప్పి ఉన్నట్టుండి పాస్టర్ ఇస్మాయిల్ పక్కనే ఉన్న టవర్ ఎక్కారని.. శాంతియుత ర్యాలీ అని చెప్పి ఇలా చేయడం సరికాదని ఆయనకు నచ్చజెప్పానని జయరాజు తెలిపారు.ఇస్మాయిల్ టవరెక్కడంతో.. ఆయన పాస్టర్ కాబట్టి.. పెదపేటలో కూలగొట్టినట్లు చెబుతున్న చర్చిల్లో ఈయన చర్చి కూడా ఉందనే బాధతో ఇలా టవర్ ఎక్కాడని తాను భావించానన్నారు జయరాజు. కానీ ఆ తర్వాత స్థానికుల్ని అడిగి ఇస్మాయిల్ గురించి తెలుసుకుంటే.. కూలగొట్టినట్లు చెబుతున్న వాటిలో పాస్టర్ చర్చి కూల్చలేదని తెలిసిందన్నారు. కొద్దిసేపటి తర్వాత ఇస్మాయిల్ కిందకు వచ్చారని.. తాను అక్కడి నుంచి వెళ్లిపోయానన్నారు. అనంతరం చర్చిలు కూల్చివేతలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లామని.. కానీ పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం అక్కడికి రాలేదన్నారు. ఆయన్ను హౌస్ అరెస్ట్ చేసినట్లు తనకు తెలిసిందని.. ఇంలో పోలీసులు ఇస్మాయిల్‌ను కొట్టినట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. తీరా తాను వెళ్లి ఆరా తీస్తే ఆయన్ను పోలీసులు కొట్టలేదని తనకు తెలిసిందన్నారు. పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం పోలీసులు తనపై దాడిచేసినట్లు ఆరోపించారని.. డిప్యూటీ స్పీకర్ రఘురామపై విమర్శలు చేశారన్నారు.'ఇస్మాయిల్ గురించి నిజాలు తెలిసిన తర్వాత ఆకివీడు పెదపేటలో స్థానికుల్ని పిలిచి అన్ని విషయాల గురించి వారితో చెప్పాను. పాస్టర్ ఇస్మాయిల్ అంతటితో ఆగకుండా చర్చిల్చి కూల్చివేస్తున్నారంటూ తన యూట్యూబ్ ఛానల్‌లో వీడియోను అప్‌లోడ్ చేయడంతో వైరల్ అయ్యింది. ఆ తర్వాత చుట్టపక్కల పాస్టర్లు ఆయన్ను పరామర్శించడానికి వచ్చారు, సన్మానం చేశారు. అప్పుడు ఇస్మాయిల్ గురించి ఆరా తీస్తే పూర్తి వివరాలు తెలిశాయి. ఇస్మాయిల్ ఆర్థికంగా స్థిరపడటానికి, రాజకీయ ఎదుగుదల కోసం ఇస్మాయిల్ ఇలా చేశారని తెలిసింది. తన సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ దళితుల్ని పావులుగా వాడుకుంటున్నారు. నేను ఎక్కడా డిప్యూటీ స్పీకర్ రఘురామ గురించి ఎమ్మెల్యే గురించి మాట్లాడలేదు' అన్నారు.'పెదపేటలో అమ్మవారి గుడి కావాలి, రామాలయం వద్దని చెబుతున్నారు. ఆ విషయాన్ని పక్కన పెట్టి సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ ఏదేదో మాట్లాడారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ రఘురామ మమ్మల్ని తప్పుగా అనుకున్నారు. నేను గత ఎన్నికల్లో కూటమి పార్టీల కోసం పనిచేశాను.. యువగళం సమయంలో నారా లోకేష్‌పై రాళ్లు వేసిన సమయంలో, పవన్ కళ్యాణ్ వచ్చిన సమయంలో ఆయనకు వ్యతిరేకగా జరిగిన ఘటనల్ని నేను ఖండించాను.. మా నాన్న, చిన్నాన్న టీడీపీలో ఉన్నారు. నేను ఏదైనా తప్పు జరిగితే.. ఇది తప్పు అని నేను రియాక్ట్ అవుతాను. ఆకివీడు పెదపేటలో జరిగిన ఘటనకు నాకు ఎలాంటి సంబంధం లేదు.. ఆ గొడవలో నన్ను ఇరికించారు. కానీ నా వాదనను ఎవరూ పట్టించుకోలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.'ఇస్మాయిల్ అనే వ్యక్తి స్వలాభం కోసం చేసిన పనితో నేను ఈ కేసులో ఇరుక్కున్నాను. ఈ కేసు నమోదు చేసిన తర్వాత నేను జైలుకు వెళ్లాను.. బెయిల్‌పై వచ్చాను. ఇస్మాయిల్ ఎమ్మెల్యేను విమర్శిస్తే లక్షల రూపాయలు వస్తున్నాయి. ఈ ఘటనలో ఇంకా చాలామంది జైల్లో ఉన్నారు కానీ ఇస్మాయిల్ కనీసం వాళ్లను పరామర్శించలేదు. ఇస్మాయిల్ ఈ ఘటన తర్వాత కొంతమంది దగ్గర డబ్బులు వసూళ్లు కూడా చేశారు.. ఈ ఘటనలో వాస్తవాలు తెలియాలనే నేను ఈ విషయాలను చెబుతున్నాను. ఇస్మాయిల్ చేసిన తప్పులకు సంబంధించి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి. త్వరలోనే అన్ని వివరాలు చెబుతాను' అని చెప్పుకొచ్చారు జయరాజు.

# రేషన్ కార్డుల పునః పరిశీలన..!

## ఐటీఆర్ ఫైల్ చేసిన లబ్ధిదారుల్లో ఆందోళన..!

చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి...!తెలంగాణలో రేషన్ కార్డుల పునఃపరిశీలన ప్రక్రియ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు చేపడుతున్న తనిఖీలు, ఆదాయ ప్రమాణాల ఆధారంగా అర్హతల పరిశీలన, ఇప్పటికే గణనీయ సంఖ్యలో కార్డుల తొలగింపు పరిణామాలు లబ్ధిదారుల్లో ఆసక్తితో పాటు ఆందోళనను కూడా కలిగిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న





వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి కనిపిస్తోంది. రేషన్ కార్డు వ్యవస్థ పేద మరియు తక్కువ ఆదాయం గల కుటుంబాలకు ఆహార భద్రతను అందించే కీలక సంక్షేమ పథకం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షలకుపైగా కార్డులు అమలులో ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో అర్హతల పునఃపరిశీలన ప్రక్రియ ప్రారంభమవడం సహజంగానే పెద్ద చర్చకు దారితీసింది.ప్రభుత్వం దృష్టిలో ఈ చర్యల ఉద్దేశం సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అర్హులకే చేరేలా చూడడం. డూప్లికేట్ ఎంట్రీలు, ఆదాయ మార్పులు, అనర్హ కార్డులను గుర్తించడం ద్వారా వ్యవస్థలో పారదర్శకత పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదాయానికి సంబంధించిన సూచికలుగా ఐటీ రిటర్న్ వంటి ఆధారాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.అయితే, ఐటీ రిటర్న్ దాఖలు చేయడం ఒక్కటే అధిక ఆదాయం ఉన్నదనే సూచిక కాదన్న వాదన వినిపిస్తోంది. బ్యాంకు రుణాలు, ఉద్యోగ అవసరాలు, పన్ను రీఫండ్ వంటి కారణాలతో తక్కువ ఆదాయం గల వ్యక్తులు కూడా రిటర్న్ దాఖలు చేస్తుంటారు. కాబట్టి ఒకే ప్రమాణం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే కొన్ని సందర్భాల్లో నిజమైన అర్హులు జాబితా నుంచి తప్పిపోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది.క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిశీలన విధానంపై కూడా కొన్ని ప్రశ్నలు లేవుతున్నాయి. గ్రామ లేదా వార్డు స్థాయిలో అధికారులు డిక్లరేషన్లు తీసుకోవడం, ఆదాయాన్ని అంచనా వేయడం వంటి ప్రక్రియల్లో ప్రాంతానుసారంగా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతుండటంతో ప్రజల్లో అనిశ్చితి పెరిగింది.ఇదే సమయంలో ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను కూడా చేపడతామని ప్రకటించింది. పాత కార్డుల పరిశుభ్రీకరణతో పాటు కొత్త అర్హుల చేర్పు?ఈ రెండు ప్రక్రియలు సమాంతరంగా కొనసాగుతున్నాయి. దీనివల్ల వ్యవస్థను సమతుల్యంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని భావించవచ్చు.సంక్షేమ పథకాల నిర్వహణలో మరో ముఖ్యమైన అంశం ఆర్థిక భారం. సబ్సిడీ వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో లీకేజీలను నియంత్రించడం ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు. ఈ దృష్టితో అర్హతల పునఃపరిశీలన అవసరమనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ఈ ప్రక్రియలో "ఎక్స్‌క్లూజన్ ఎరర్" అంటే అర్హుల తొలగింపు జరగకూడదన్నది నిపుణుల సూచన.ఇలాంటి సందర్భాల్లో కొన్ని జాగ్రత్తలు అవసరం. కార్డు రద్దు ముందు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం, వివరణకు అవకాశం కల్పించడం, అప్పీల్ వ్యవస్థను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు పారదర్శకతను పెంచుతాయి. అదేవిధంగా, అర్హతల నిర్ధారణలో ఆదాయం మాత్రమే కాకుండా జీవన ప్రమాణాలు, ఆస్తులు, సామాజిక పరిస్థితులు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.మొత్తానికి, రేషన్ కార్డు పునఃపరిశీలన ప్రక్రియ ఒక పరిపాలనా అవసరంగా కనిపించినప్పటికీ, దాని అమలు విధానం కీలకం. అనర్హులను గుర్తించడం ఎంత ముఖ్యమో, అర్హులకు నష్టం జరగకుండా చూడడం అంతే ముఖ్యమైనది. పారదర్శకత, స్పష్టత, సమగ్ర పరిశీలన ఈ మూడు అంశాలు సమతుల్యంగా అమలైతేనే ఈ ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

# కాపు వర్గం మారుతోందా

కాకినాడ, ఏప్రిల్ 29,

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చినట్లే కలలు కంటోంది. ఎంతగా అంటే వచ్చే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తమన్నంతగా. ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో తాము సులువుగా గెలుస్తామన్న గుడ్డినమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు కనిపిస్తుంది. అందుకే నేతలు ఎక్కడికక్కడకక్కడ ఈ సమయంలోనూ తమ నియోజకవర్గంలో వ్యాపారాలు దెబ్బతినకుండా టీడీపీ నేతలతో కుమ్మక్కువుతున్నారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ మిలాఖత్ అయి మద్యం, ఇసుక వంటి వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అయితే ఇవి లోపాయికారిగా జరిగినప్పటికీ బాహ్య ప్రపంచానికి మాత్రం సులువుగానే తెలుస్తోంది.అందుకే ప్రజలు రెండు పార్టీలను ఒకే గాటిన కట్టే అవకాశముంది. ముఖ్యంగా వైసీపీకి పట్టున్న కొన్ని జిల్లాల్లోనూ టీడీపీ నేతలతో వ్యాపార సంబంధాలను నెరుపుతూ గుట్టుగా పది రూపాయలు సంపాదించుకునే పనిలో ఉన్నారు. అందుకే స్థానిక ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలు కూడా తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా వారిని తమలో ఒకరిగా చేర్చుకుని కొత్త స్ట్రాటజీకి తెరదించారు. ఈ విషయాలను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియా ద్వారా బయటకు చెబుతున్నారు. ఉదాహరణకు నెల్లూరు జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో కొందరు వైసీపీ నేతలు టీడీపీ నేతలతో కలసి రహస్యంగా వ్యాపార భాగస్వాములుగా ఉన్నారు.అయితే వైసీపీ కేంద్ర నాయకత్వం వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. లైట్ గానే తీసుకుంటుంది. అంతెందుకు వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలోనూ అనేక మంది వైసీపీ నేతలకు టీడీపీ నేతలతో లోపాయికారీ ఒప్పందాలున్నట్లు చెబుతున్నారు. ఇవి కార్యకర్తలకు తెలుసు. కానీ వైసీపీ నాయకత్వం మాత్రం వారిపై చర్యలకు తీసుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఇలాగే కొనసాగితే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ, తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో కానీ వైసీపీ నేతలు అధికార పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదన్నది వాస్తవం. ఇప్పటికైనా నాయకత్వం జాగ్రత్త పడకపోతే నష్టం స్థాయి అంచనా వేయలేని స్థితిలో ఉండనుంది.


# అదనపు విద్యుత్.. అరకొర ధర

ముంబై, ఏప్రిల్ 29, (

భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అయితే, ఈ పచ్చని కల వెనుక విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. నిబంధనల ప్రకారం సోలార్ విద్యుత్‌ను తప్పనిసరిగా కొనాల్సిన డిస్కంలు, తీరా వాడుక సమయంలో డిమాండ్ లేకపోవడంతో ఆ విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల్లో కారుచౌకగా అమ్ముకోవాల్సి వస్తోంది. సాధారణంగా యూనిట్ రూ. 2 నుంచి రూ. 3.50 వెచ్చించి కొనుగోలు చేస్తుంటే, మార్కెట్లో కేవలం 50 పైసలకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది.దేశంలో అతిపెద్ద విద్యుత్ ఎక్స్ఛేంజ్ అయిన ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ గణాంకాల ప్రకారం.. గరిష్టంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యే మధ్యాహ్నం వేళల్లో యూనిట్ ధర ఒక్కోసారి రూ. 0.50 పైసలకు పడిపోతోంది. డిస్కంలు దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా ఈ విద్యుత్‌ను రూ. 3 పైనే వెచ్చించి సేకరిస్తాయి. ఒకవేళ ఎక్స్ఛేంజీలో అమ్మకపోతే ఆ విద్యుత్ వృథా అవుతుంది, కాబట్టి "ఏమీ రాకపోవడం కంటే.. రూపాయి వచ్చినా చాలు" అనే ధోరణితో డిస్కంలు ఈ నష్టదాయక వ్యాపారాన్ని సాగిస్తున్నాయి.ఈ సంక్షోభం వెనుక ప్రధానంగా 'పునరుత్పాదక కొనుగోలు బాధ్యత' అనే నిబంధన ఉంది. దీని ప్రకారం ప్రతి డిస్కం తాము పంపిణీ చేసే విద్యుత్‌లో కొంత శాతాన్ని తప్పనిసరిగా సౌర లేదా పవన విద్యుత్ రూపంలోనే సేకరించాలి. రాబోయే ఐదేళ్లలో ఈ లక్ష్యం 43 శాతానికి పెరగనుంది. దీనివల్ల అవసరం లేకున్నా డిస్కంలు విద్యుత్‌ను కొనాల్సి వస్తోంది."దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెరుగుతోంది కానీ, దాన్ని నిల్వ చేసే బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు ఇంకా అందుబాటులోకి రాలేదు. అందుకే మధ్యాహ్నం వేళల్లో ఉత్పత్తి అయ్యే భారీ విద్యుత్‌ను ఏం చేయాలో పాలుపోక ఎక్స్ఛేంజీల్లో విక్రయిస్తున్నారు" అని ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ ( ఎండీ రాజేష్ మెడిరట్టా విశ్లేషించారు.భారతదేశంలో ప్రస్తుతం గ్రిడ్ స్థిరత్వం కోసం బ్యాటరీ స్టోరేజ్‌తో కూడిన విద్యుత్ ధర యూనిట్‌కు సగటున రూ. 5 వరకు ఉంది. ఇది డిస్కంలకు భారంగా మారుతోంది. మరోవైపు గత ఏడాది మే నెలలో భారీ వర్షాల కారణంగా డిమాండ్ తగ్గి, విద్యుత్ ధర ఎక్స్ఛేంజీల్లో సున్నా కు పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఇప్పటికే దేశవ్యాప్తంగా డిస్కంలు సుమారు రూ. 6 లక్షల కోట్ల రుణ భారంతో సతమతమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ డిస్కంల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను అందుకోవాలనే తొందరలో డిమాండ్‌ను సరిగ్గా అంచనా వేయకుండా చేస్తున్న కొనుగోళ్లు ఈ అప్పులను మరింత పెంచుతున్నాయి.కేవలం సోలార్ ప్యానెల్స్ పెంచుకుంటూ పోతే సరిపోదు. వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను పగటిపూటకి మార్చడం, థర్మల్ ప్లాంట్లను అవసరానికి తగ్గట్టుగా నియంత్రించడం వంటి నిర్మాణాత్మక మార్పులు చేయాలి" అని హెక్సా క్లైమేట్ సొల్యూషన్స్ చైర్మన్ సంజీవ్ అగర్వాల్ సూచించారు.విద్యుత్ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 'టైమ్ ఆఫ్ ది డే'టారిఫ్ విధానం దీనికి సరైన పరిష్కారం. అంటే సౌర విద్యుత్ సమృద్ధిగా దొరికే పగటి వేళల్లో తక్కువ ధరకే వినియోగదారులకు విద్యుత్ అందించి, డిమాండ్ ఎక్కువగా ఉండే సాయంత్రం వేళల్లో రేట్లు పెంచడం. దీనివల్ల డిమాండ్ మేనేజ్మెంట్ సులువవుతుంది. అలాగే, రాష్ట్రాల అవసరాలను బట్టి నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలని మాజీ విద్యుత్ శాఖ కార్యదర్శి అలోక్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

విజయవాడ, ఏప్రిల్ 29,



ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మాడు పగలగొడుతున్నాయి.. రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నెల నుంచే ఎండల తీవ్రత కనిపించింది.. ముందు 35 డిగ్రీల నుంచి మొదలై 40 డిగ్రీల వరకు చేరింది. మార్చి నెల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి.. 42 డిగ్రీల నుంచి 45 వరకు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతులు 45 డిగ్రీలు కూడా దాటి 46 డిగ్రీల వరకు నమోదవుతోంది. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇవాళ అధిక ఉష్ణోగ్రతలతో పాటుగా 19 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 21 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందన్నారు. విజయనగరం జిల్లాలోని బాడంగి, బొబ్బిలి, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాల్లో.. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వేడిగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మార్కాపురం జిల్లా కంభంలో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 45.1 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.8 డిగ్రీలు, అమరావతిలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా బెస్తపల్లిలో 44.2 డిగ్రీలు, కడప జిల్లా వీరబల్లిలో 44.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 227మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.ఏపీలో ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ప్రభావం కనిపిస్తోంది.. జనాలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అంటున్నారు. రాష్ట్రంలో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

# కేటీఆర్ వర్సెస్ కవిత




హైదరాబాద్ ఏప్రిల్ 29,

కల్వకుంట్ల కుటుంబంలో వారసత్వ పోరు ఇప్పుడు కీలకదశకు చేరు?ంది. కేసీఆర్ వారసులలో ఎవరు సమర్థులు కేటీఆర్ నా..కవితనా ?. కేటీఆర్.. మగపిల్లాడే వారసుడు అనే అడ్వాంటేజ్ తీసుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిపోయారు. ఆయన నాయకత్వాన్ని మొదట కవిత కూడా అంగీకరించారు. కానీ తనకు అసలు రాజకీయ భవిష్యత్తే లేకుండా చేయాలనుకోవడంతో కవిత తన దారి తాను చూసుకున్నారు. ఆమె సొంత రాజకీయాలు ప్రారంభించడంతో నిజంగా ఇద్దరిలో ఎవరు రాజకీయంగా సమర్థులు అనే ప్రశ్న వస్తోంది.బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని గాడిలో పెట్టడంలో కేటీఆర్ ఆశించిన స్థాయిలో సఫలం కాలేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, పార్టీ నుంచి కీలక నేతల వలసలు ఆయన నాయకత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. కేసీఆర్ మళ్లీ క్రియాశీలక బాధ్యతలు తీసుకోవాలని .. పార్టీని గాడిలో పెట్టాలని కేడర్ కోరుకోవడమే కేటీఆర్ వైఫల్యానికి నిదర్శనమని చెబుతున్నారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఢీకొట్టే విషయంలో పెద్దగా ఆకట్టుకోలేకపోవడం?ప్రజా సమస్యలపై కంటే కేవలం సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కావడం ఆయన రాజకీయ పరిణతిని ప్రశ్నించేలా చేశాయి.కవిత తన రాజకీయ అస్తిత్వం కోసం అత్యంత తెలివైన పావులను కదిపారు. బీఆర్ఎస్ వదులుకున్న తెలంగాణ, టీఆర్ఎస్ సెంటిమెంట్‌ను ఆమె మళ్లీ అందిపుచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావ సభకు తరలివచ్చిన జనసందోహం, ఆమె మాటల్లోని స్పష్టత రాజకీయ వర్గాలను మెప్పించాయి. తండ్రి, సోదరుడిపై నేరుగా విమర్శలు చేస్తూనే, బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయిందని, తాను మళ్లీ సామాజిక తెలంగాణ ఆశయాలను మోస్తానని చెప్పడం ద్వారా ఆమె బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై గట్టిగా గురిపెట్టారు.ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బట్టి చూస్తే, రాజకీయ ఎత్తుగడల్లో కేటీఆర్ కంటే కవితే కాస్త ముందున్నట్లు కనిపిస్తోంది. కేటీఆర్ కేవలం పార్టీ పదవిని వారసత్వంగా స్వీకరిస్తే, కవిత మాత్రం ప్రతికూల పరిస్థితుల్లో కూడా తనదైన శైలిలో పబ్లిసిటీని, జనసమీకరణను నిర్వహించి ఇంపాక్ట్ సృష్టించగలిగారు. బీఆర్ఎస్‌ను డూప్లికేట్ అని పిలిచే స్థాయికి ఆమె తన కొత్త పార్టీని తీసుకెళ్లడం ఆమె రాజకీయ చతురతకు నిదర్శనం. నియోజకవర్గ స్థాయి నేతలను ఆకర్షించడంలో, ముఖ్యంగా బీఆర్ఎస్‌లో వివక్షకు గురైన వారిని చేరదీయడంలో ఆమె వేగం పెంచారు.కవిత సృష్టించిన ఈ ఇంపాక్ట్ బీఆర్ఎస్‌కు పెనుగండంగా మారే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చీలితే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్ లేదా బిజెపికి లాభం చేకూరుస్తుందా? లేక కవిత నిజంగానే మూడవ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందా? అన్నది ఉత్కంఠ రేపుతోంది. కేటీఆర్ ఇప్పటికైనా తన శైలిని మార్చుకుని పార్టీని కాపాడుకుంటారా, లేక కవిత సృష్టించిన ఈ సునామిలో బీఆర్ఎస్ తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోతుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# నాటి చంద్రబాబు కాదా...

విజయవాడ, ఏప్రిల్ 29,



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెతక వైఖరిని అవలంబిస్తున్నారు. గతంలో అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరించేవారు. పార్టీ నేతలు కూడా క్రమశిక్షణతో మెలిగేవారు. కానీ ఎందుకో.. ఏమో..తెలియదు కానీ చంద్రబాబులో చాలా మార్పు కనిపిస్తుంది. పార్టీ నేతల సంగతి పక్కన పెడితే అధికారులపై కూడా అజమాయిషీ లేకుండా పోయింది. సమీక్షల్లో సీరియస్ అనే మాటలను వినటమే కానీ.. కనీసం సమస్యకు కారణమయిన వారిపై ఎలాంటి చర్యలకు దిగకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తనలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తానని ప్రకటించారు.1995 నాటి ముఖ్యమంత్రి మాటేమో కానీ, కనీసం 2014 నాటి ముఖ్యమంత్రి కూడా కనిపించడం లేదన్న కామెంట్స్ ఇప్పుడు కార్యకర్తల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే గత వారం రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు, డీజిల్ కొరత సమస్య ఉందని తెలిసినప్పటికీ అధికారుల ఉదాసీన వైఖరిని ఆయన ప్రశ్నించలేకపోతున్నారు. అదే సమయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ అంటూ నిత్యం పరితపించే చంద్రబాబు ఇంత జరుగుతున్నా అది ఏం చేస్తుందన్న దానిపై కూడా నాయుడు పెదవి విప్పకపోవడం చర్చనీయాంశమైంది. నిజానికి చంద్రబాబు అధికారులను అలా ఊరికే వదిలేసే రకం కాదు. ఇరవై నాలుగు గంటలు వెంటపడి పనులు చేయించుకుంటారన్న పేరు ఆయనకు గతంలో ఉండేది.కానీ 2024 తర్వాత మాత్రం చంద్రబాబు నాయుడు పూర్తిగా మారిపోయారు. ఎంతగా మారిపోయారంటే.. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టడం వంటి వాటికే సరిపెట్టారు. అందులో ఎక్కువగా తన విజన్ తో పాటు తన పూర్వ విషయాలను చెప్పుకోవడమే సరిపోతుంది. అంతేతప్ప క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలు సరిదిద్దలేకపోవడం, సక్రమంగా హెచ్చరికలు జారీ చేయకపోవడం వల్లనే ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని అంటున్నారు. చంద్రబాబుకు కూడా పెట్రోలు, డీజిల్ కొరత సమస్యను చెప్పకుండా దాచి పెట్టారంటే చంద్రబాబు ఇచ్చిన అలుసు మాత్రమేనని చెప్పాలి. మరి చంద్రబాబు ఇప్పటికైనా మారాలని కోరుకుంటున్నారు.

# కలకలం రేపుతున్న వెంబూ లెటర్

తిరువనంతపురం, ఏప్రిల్ 29,

జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబు అమెరికాలో స్థిరపడిన భారతీయులకు కీలకమైన పిలుపునిచ్చారు. అమెరికాలో స్థిరపడిన భారతీయులు తమ భవిష్యత్తు గురించి పునరాలోచించి, భారత్ కి తిరిగి రావాలని ఎక్స్ మాధ్యమంగా కీలక పిలుపునిచ్చారు.అమెరికాలో నివసిస్తున్న భారతీయులను ఉద్దేశించే ఈ లేఖ రాశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది. దేశానికి తిరిగి వచ్చి, భారత అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల క్రితం తాను అమెరికాకు వలస వెళ్లిన సొంత అనుభవాన్ని ఆ లేఖలో రాసుకొచ్చారు. ఆ దేశం ఒకప్పుడు అనేక అవకాశాలను ఇచ్చిందన్నారు. అదే సమయంలో వలసు, ఉద్యోగాల విషయంలో ప్రస్తుతం పరిస్థితులు మారిపోతున్నాయని, రాజకీయ పరిస్థితులు, ఇతరత్రా విషయాలు భారతీయులను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయులు సాంకేతికత రంగంలో, ఇతరత్రా రంగాల్లో సొంతంగా ఎదగడంతోనే భారత్ గౌరవం ప్రపంచ వ్యాప్తంగా మరింత పెరుగుతుందని, దీనితోనే అంతా ముడిపడి వుందని పేర్కొన్నారు. అలాగే ఆయా రంగాల్లో వున్న నిపుణులు స్వదేశానికి తిరిగి వచ్చి, భారత్ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.అమెరికాలోని భారతీయులకు బహిరంగ లేఖ. ప్రియమైన భారత సోదర సోదరీమణులారా? 37 సంవత్సరాల క్రితం నేను వచ్చినట్లే, మీరు కూడా డబ్బు లేకుండా, మంచి విద్యతో, భారత సాంస్కృతిక వారసత్వంతో అమెరికాకు వచ్చారు. మీరు అద్భుతమైత విజయం సాధించారు.అమెరికా మనకు ఎంతో మేలు చేసింది.అందుకు మనం కృతజ్ఞతతో ఉండాలి ? కృతజ్ఞత మన భారతీయ నైజం.భారతీయులు మన ఉద్యోగాలు లాగేసుకుంటున్నారని అమెరికన్లు చాలా మంది అనుకుంటున్నారు. మన విజయం అన్యాయమైన విజయంగా వారు భావిస్తున్నారు.వచ్చే ఎన్నికలు దీన్ని సరిచేస్తాయని మీరు అనుకోవచ్చు, కానీ మీ ఎంపిక మన భారతీయ నాగరికతను ద్వేషించే వారికి, నాగరికతనే ద్వేషించే వారికి మధ్య ఉంటుంది. రైటిస్టులు, లెఫ్టిస్టులు మధ్య వుంటుంది. ఇందులో మీరు ప్రేక్షకులు మాత్రమే.అయితే.. ఓ విషయం మాత్రంనిజం. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులకు లభించే గౌరవం ఎక్కువగా భారత దేశపు తలరాతపైనే ఆధారపడి వుంటుంది. భారత్ పేద దేశంగానే వుండిపోతే, వామపక్ష మేధావులు మనకు నైతిక ఉపన్యాసాలిస్తారు. రైట్ వింగ్ వారు ఉపన్యాసాలిస్తారు.ఇదేదో మర్యాద అన్న భ్రమలో మనం వుండొద్దు. ఈ ప్రపంచంలో శ్రేయస్సు, భద్రతతో పాటు గౌరవం కూడా కావాలి. ఇవన్నీ ఒకే ఒక మూలం నుంచి వస్తాయి. అదే సాంకేతికత నైపుణ్యం. ఆ నైపుణ్యాన్ని సాధించడానికి భారత్ తగినంత మేధోశక్తిని ఉత్పత్తి చేస్తుంది. కానీ ఎక్కువ శాతం మనం అమెరికాకి ఎగుమతి చేసేశాం. ఇది చాలా బాధాకరం. భారత్ లో మనం నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ పోతే, మన నాగరికత బలం కూడా తన ఉనికిని చాటుతుంది. ఇది ఊహించడం కష్టమే అయినా.. మీరందరూ స్వదేశానికి తిరిగి రండి. భారత మాతకు మీ ప్రతిభ ఎంతో అవసరం" అంటూ శ్రీధర్ వెంబూ రాసుకొచ్చారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో శ్రీధర్ వెంబు ఈ లేఖ రాసుకొచ్చారు. భారత్, చైనా నరక కూపాలని, ఈ దేశాల నుంచి వచ్చే వలసదారులు ల్యాప్ టాప్ గూండాలు అంటూ తీవ్రంగా విమర్శించిన విషయం తెలిసిందే.

# కేసీఆర్ రీ లోడింగ్...

హైదరాబాద్, ఏప్రిల్ 29,



తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విద్యార్థి శంఖారావం వినిపించాలని గులాబీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ పిలుపుతో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ఎలాగైతే కదిలాయో.. అదే తరహా ఇంటెన్సిటీని ప్రస్తుత రాజకీయ పోరాటాల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రత్యక్షంగా రంగంలోకి రాకముందే విద్యార్థి లోకం రహదారులపైకి వచ్చింది. విద్యార్థుల పోరాటమే ఆనాడు రాజకీయ పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని కేసీఆర్ మళ్ళీ నమ్ముకున్నారు. ప్రతి కాలేజీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగ కమిటీలను బలోపేతం చేయాలని, యువతను ఫుల్ టైమ్ పొలిటికల్ వారియర్స్ 'గా మార్చాలని ఆయన ఆదేశించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ యంత్రాంగం కొంత స్తబ్దుగా మారినా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలంటే విద్యార్థుల తెగువ అవసరమని ఆయన గుర్తించారు.అయితే, ఉద్యమ కాలం నాటి సెంటిమెంట్ వేరు, ఇప్పటి రాజకీయ అవసరాలు వేరు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం అనే ఏకైక లక్ష్యం విద్యార్థులను భావోద్వేగంతో ఏకం చేసింది. కానీ నేడు ఉపాధి కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలే విద్యార్థి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ వంటి వారి నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి, ఫీజుల బకాయిలపై నిరసనలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు. కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే పోరాటాలకు విద్యార్థులు ఏ మేరకు స్వచ్ఛందంగా కదులుతారనేది ప్రశ్నార్థకమే. కేసీఆర్ కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, యువతకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. కాలేజీ స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంచి, వారిని భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రంగా చూపడం ద్వారా కొత్త రక్తాన్ని పార్టీలోకి ఎక్కించాలనుకుంటున్నారు. ప్రభుత్వంపై పోరాడే క్రమంలో విద్యార్థులు ఎదుర్కొనే కేసులను, సమస్యలను పార్టీ అండగా నిలబడి చూసుకుంటుందని భరోసా ఇవ్వడం ద్వారా వారిని యాక్టివ్ మోడ్ లోకి తీసుకురావాలని చూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థుల్లో ఉన్న చిన్నపాటి అసంతృప్తిని కూడా వదులుకోకూడదని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రత్యేకించి విద్యా రంగానికి కేటాయింపులు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ఉన్న వ్యతిరేకతను విద్యార్థి కమిటీల ద్వారా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం కేసీఆర్ మాస్టర్ ప్లాన్. విద్యార్థులు రోడ్లెక్కితే అది సృష్టించే ఇంపాక్ట్ మీడియాలోనూ, ప్రజల్లోనూ బలంగా ఉంటుంది. ఇది రాజకీయంగా బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకువస్తుందని ఆశిస్తున్నారు.విద్యార్థులను రాజకీయాల కోసం రోడ్లపైకి తీసుకురావడం కేసీఆర్ లాంటి చతురత కలిగిన నేతకు పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ, కేవలం ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కాకుండా, విద్యార్థుల కెరీర్‌కు బీఆర్ఎస్ ఏ రకమైన భరోసా ఇస్తుందనే స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. రాజకీయ సమీకరణలు మారుతున్న తరుణంలో, ఈ విద్యార్థి కమిటీలు బీఆర్ఎస్‌కు ఏ మేరకు బూస్టర్ డోస్ గా మారుతాయో చూడాలి. ఏది ఏమైనా, కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సెగ పుట్టించడం ఖాయం అనుకోవచ్చు.

# కొండెక్కిన కోడిగుడ్డు ధర

హైదరాబాద్, ఏప్రిల్ 29, (న



ఇటీవల తగ్గినట్లే తగ్గిన గుడ్ల ధరలు.. మళ్లీ పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో కేవలం 15 రోజుల్లోనే గుడ్ల ధరలు భారీగా పెరిగాయి.. ఒక్కో గుడ్డుకు రూ.3 మేర ధర పెరిగింది. కొన్ని రోజుల్లోనే ఆకాశాన్నంటుతున్న గుడ్ల ధరలు వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దాదాపు రెండు వారాల క్రితం ఒక గుడ్డు ధర రూ.4 ఉండగా, ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.7 కి చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో 8 రూపాయాలు సైతం అమ్ముతున్నారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా రిటైల్ కిరాణా దుకాణాలలో ధరలు ఒకే విధంగా ఉండగా, హోల్‌సేల్ దుకాణాలు ఒక్కో గుడ్డును రూ. 6.30 చొప్పున అమ్ముతున్నాయి.కోళ్ల అధిక మరణాలు, ఉత్పత్తి తగ్గడం.. డిమాండ్ పెరగడం.. వేగంగా పెరుగుతున్న ధరలకు కారణమని కోళ్ల పెంపకందారులు పేర్కొంటున్నారు. "వేసవిలో, ఫారాలలో కోళ్ల మరణాల రేటు ఎక్కువగా ఉంటుంది. ఉత్పాదకత తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, గుడ్లు, కోళ్ల మాంసానికి డిమాండ్ అలాగే కొనసాగుతుంది. సరఫరా తక్కువగా ఉండటంతో, నష్టాలను పూడ్చుకోవడానికి ఫారాలలో గుడ్లు, కోళ్ల ధరలను పెంచుతారు." అని రంగారెడ్డి జిల్లాలోని ఒక కోళ్ల ఫారం యజమాని తెలిపారు..సంవత్సరంలోని ఇతర నెలలతో పోలిస్తే వేసవిలో మరణాల రేటు 30 శాతం ఎక్కువగా ఉంటుందని మరో పౌల్ట్రీ ఫారం యజమాని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, మార్కెట్లో కోడి మాంసం ధర కిలోకు రూ.240 ఉండగా, లైవ్ బర్డ్ (బతికున్న కోడి) కిలో రూ.170కి అమ్ముతున్నారు. హైదరాబాద్ లో కేజీ చికెన్ రూ.240 నుంచి రూ.260 వరకు అమ్ముతున్నారు. గత వారం కేజీ చికెన్ రూ.280 నుంచి 300వరకు అమ్మారు.మల్లేపల్లిలోని చికెన్ షాప్ యజమాని మహ్మద్ నజీర్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా చికెన్ ధరలు కేవలం కొన్ని రూపాయలు మాత్రమే పెరిగాయని చెప్పారు. "వేసవిలో ప్రజలు వివిధ కారణాల వల్ల చికెన్ కొనడానికి దూరంగా ఉంటారు.. కాబట్టి చిల్లర అమ్మకాల డిమాండ్ తక్కువగా ఉంటుంది. హోటళ్లు, క్యాటరర్లకు జరిగే సాధారణ సరఫరాలకు ఎలాంటి ఆటంకం కలగలేదు," అని నజీర్ అన్నారు.కోళ్ల ఫారాలు రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికంగా ఉన్నాయి.ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా ఎగుమతులు దెబ్బతినడంతో మార్చిలో గుడ్ల ధరలు తగ్గాయి. అయితే, అది స్వల్ప కాలం వరకే కొనసాగింది.. అయితే.. కొళ్ల మరణాలు.. డిమాండ్ పెరగడం వల్ల.. మున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ ఓనర్స్ పేర్కొంటున్నారు.

# సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవటం ఎలా

హైదరాబాద్, ఏప్రిల్ 29,

రాష్ట్రంలో జనగణన 2027 ప్రక్రియ ప్రారంభమైంది. గతంలో ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చి వివరాలు అడిగి వెళ్లేవారు, కానీ ఈసారి పౌరులే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ డిజిటల్ ప్రక్రియను ప్రజలు సులభంగా పూర్తి చేసేలా నాలుగు ప్రధాన దశల్లో పోర్టల్‌ను రూపొందించారు. ఇంటి వద్ద నుంచే చాలా సులభంగా ఈ ప్రక్రియను ఎలా పూర్తి చేసుకోవాలో ఇక్కడ తెలుసుకోండి?..

మొదటి దశ: రిజిస్ట్రేషన్, లాగిన్

ముందుగా పౌరులు అధికారిక సెన్సస్ పోర్టల్ (ష్టబిబిజూబ://బవ.ఇవనిబబీబ.ఱనీల.తిని) లోకి వెళ్లాలి. అక్కడ తమ రాష్ట్రాన్ని (తెలంగాణ) ఎంచుకుని, స్క్రీన్‌పై కనిపించే క్యాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. అనంతరం 'హౌస్‌హోల్డ్ రిజిస్ట్రేషన్' విభాగంలో ఇంటి యజమాని పేరు, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడి వివరాలను నమోదు చేయాలి. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే?. ఒక మొబైల్ నంబర్‌తో ఒక కుటుంబం వివరాలు మాత్రమే నమోదు చేయగలరు.

రెండవ దశ : ధ్రువీకరణ, స్థల గుర్తింపు

నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ (ుఉఖ) ద్వారా లాగిన్ అవ్వాలి. ఇక్కడ మీకు నచ్చిన భాషను (తెలుగు, ఇంగ్లీష్, హిందీ లేదా ఉర్దూ) ఎంచుకునే వెసులుబాటు ఉంది. భాషను ఎంచుకున్న తర్వాత మీ జిల్లా, పిన్ కోడ్, గ్రామం లేదా పట్టణం వంటి వివరాలను పూరించాలి. చివరగా మ్యాప్‌లో మీ ఇంటి ఖచ్చితమైన లొకేషన్‌ను రెడ్ మార్కర్ ద్వారా గుర్తించాల్సి ఉంటుంది.

మూడవ దశ: వివరాల నమోదు - సబ్మిషన్

ఈ దశలో హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ అనే రెండు రకాల ప్రశ్నపత్రాలను పూర్తి చేయాలి. కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి వసతులు వంటి సమాచారాన్ని నమోదు చేసిన తర్వాత, అన్ని వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. సమాచారం సరైనదని నిర్ధారించుకున్నాక తర్వాత?? 'ఫైనల్ సబ్మిట్' బటన్ నొక్కాలి. వెంటనే మీకు 11 అంకెలతో కూడిన 'ాఇ ఎఆ' మొబైల్ లేదా ఈమెయిల్‌కు వస్తుంది.

నాలుగవ దశ: ఫీల్డ్ వాలిడేషన్

మీరు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసినా?.. ప్రభుత్వ ఎన్యుమరేటర్ మీ ఇంటికి వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో మీ దగ్గర ఉన్న 11 అంకెల 'ాఇ ఎఆ'ని వారికి చూపిస్తే సరిపోతుంది. మీరు ఇచ్చిన వివరాలు మరియు వారు సేకరించిన సమాచారం సరిపోలితే డేటా కన్ఫర్మ్ అవుతుంది. ఒకవేళ తేడాలు ఉంటే ఎన్యుమరేటర్ మళ్ళీ వివరాలను సేకరిస్తారు.

వివరాలు నమోదు చేసేటప్పుడు మొబైల్ ఫోన్ దగ్గర ఉంచుకోవాలి. మీరు ఇచ్చే సమాచారం అత్యంత సురక్షితంగా ఉంటుందని, ఇది కేవలం జనగణన ప్రయోజనాల కోసమే ఉపయోగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రైలులో వివాహితపై దాడి నిందితుడి కోసం పోలీసుల గాలింపు

పల్నాడు ఏప్రిల్ 29,

రెంటచింతల మండలానికి చెందిన ఓ వివాహితపై విశాఖ ఎక్స్ప్రెస్ రైలులో లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీవనోపాధి కోసం విశాఖలో ఉంటున్న బాధితురాలు ఈ నెల 26న నడికుడి వైపు ప్రయాణిస్తుండగా.., జనరల్ బోగీలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఏసీ బోగీకి తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఆవేశంతో భార్య ప్రాణాలు తీసిన భర్త

హైదరాబాద్ మీర్‌పేట్‌లో దారుణం చోటుచేసుకుంది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను కత్తితో హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం శివన్నగూడెంకు చెందిన నరసింహ (60) తన భార్య వసంతతో కలిసి బీఎన్ రెడ్డి నగర్ టీచర్స్ కాలనీలో నివసిస్తున్నాడు. భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో బుధవారం తెల్లవారుజామున కత్తితో మెడపై దాడి చేశారు.

# ఇక 3 గంటల్లో ముంబై

హైదరాబాద్, ఏప్రిల్ 29,

హైదరాబాద్ నుంచి ముంబైకు 3 గంటల్లోనే చేరుకోవచ్చు. అవును.. ఈ రెండు ప్రాంతాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మించనున్నారు హైదరాబాద్-పుణె-ముంబై మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ రానుందని, దీనికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తయిందని తెలిపారు. దాదాపు 761 కిలోమీటర్ల మేర ఈ రైలు కారిడార్ ఉంటుందని, డీపీఆర్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఈ కారిడార్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇది అందుబాటులోకి వస్తే మూడు గంటల్లోనే రెండు నగరాల మధ్య ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్, నాగ్‌పూర్ మధ్య వందే భారత్ రైలు అందుబాటులో ఉంది. హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.హైదరాబాద్-ముంబై కారిడార్‌కు సంబంధించి మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. గరిష్టంగా గంటకు 330 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణిస్తాయి. ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్ సెక్షన్లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల పొడవైన భారీ టన్నెల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ నుంచి ముంబైకు మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా పారిశ్రామికంగా కూడా రాష్ట్రానికి ఉపయోగపడనుంది. ఒక ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా ఇది ఉంటుంది. ఇక ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరు కారిడార్ల పనులపై కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్షించారు. ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఉండనున్నాయి. ఫ్యూచర్ సిటీ-చెన్నై హైస్పీడ్



కారిడార్ అమరావతి మీదుగా వెళ్తుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

బెంగళూరు కారిడార్ అనేది మన్ననూర్, సోమశిల మీదుగా వెళ్తుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు చేపడతామని, ఏపీ ప్రభుత్వం కూడా వీటికి పూర్తి సహకారం ఇస్తుందని తెలిపారు. వీటికి సంబంధించిన అలైన్‌మెంట్ ప్లాన్లను ఆయన పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపాక వీటిపై కీలక నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడానికి కేంద్రానికి పూర్తి సహకారం రాష్ట్ర ప్రభుత్వ తరపున అందిస్తామని స్పష్టం చేశారు. అటు సనత్ నగర్ టిమ్స్‌ను జూన్ 2న ప్రారంభించనున్నట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# మద్యం మత్తులో కారు డ్రైవింగ్
## అదుపు తప్పిన కారు.. మూడు వాహనలు ధ్వంసం

హయత్ నగర్ ఏప్రిల్ 29,

ఫూటుగా మందుకొట్టి.. ఒళ్ళుతెలియని స్థితిలో కారు నడుపుతూ బీభత్సం సృష్టించారు. హయత్ నగర్ లోని ఇంజాపూర్ ఘటన జరిగింది. అదుపు తప్పిన కారు పార్కింగ్ చేసిన మూడు బైకుల పైకి దూసుకొచ్చింది. మూడు బైకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారు అతివేగంగా వస్తుండడంతో వాహనదారులు, స్థానికులు పక్కకు పరుగులు తీసారు. కారు నడిపిన యువకుడు..కారులో ఉన్న మరో ఇద్దరు యువకులు కూడా మద్యం మత్తులో ఒళ్లు తెలియని స్థితిలో ఉన్నట్లు స్థానికులు పోలీసులు గుర్తించారు. పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు వున్నారు. కారు ప్రమాద దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో నమోదు అయ్యాయి.

## ప్రథమ స్థాయిలో రేగొండ వాణి విద్యానికేతన్ స్కూల్ ఎస్ ఎస్ సి రిజల్ట్ ఫస్ట్

రేగొండ,ఏప్రిల్ 29 (భారత శక్తి): బుధవారం వెల్లడించిన టెన్త్ క్లాస్ రిజల్ట్ లో వాణి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు పాఠశాల పేరును జిల్లా స్థాయిలో నిలబెట్టడం సంతోషమని స్కూల్ కరస్పాండెంట్ గాజర్ల తిరుపతి గౌడ్ తెలిపారు ఈ స్కూల్ నుండి

500 మార్కులకు పైగా సాధించిన క్రింది విద్యార్థులకి మన పాఠశాల యాజమాన్యం మరియుఉపాధ్యాయుల తరఫున అభినందనలు తెలిపారు

వంగ పల్లవి 567, మేకల యోగిత 558,
బానోతు రాఘవి 551,ఐతే నాగచరణ్ 548,
మహమ్మద్ సోనీ 529,దుంపేటి అనుశ్రీ 522,
శ్రీరాముల రాకేష్ 521,మార్త కృష్ణవేణి 520,
బానోతు చైత్ర 516,మూడు ప్రవీణ్ 515,
వజీరు హారిక 511,గాజర్ల జ్ఞానతేజ 510,

బానోతు ఐశ్వర్య 501,సోషల్ లో 100కు 100 సాధించిన దుంపేటి.అనుశ్రీకి మరియు 100 కి 99 సాధించిన వంగ పల్లవికి



వాణి స్కూల్ బృందం ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు. తెలుగులో 100కు 98 సాధించిన మేకల యోగితకి 100 కి 97 సాధించిన దుంపేటి అనుశ్రీ కి ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు.

## ఆగస్టులోనే పరిషత్ ఎన్నికలు

హైదరాబాద్, ఏప్రిల్ 29,

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని వేచి చూస్తున్న ఆశావహులకు మరో బిగ్ షాక్ తగిలేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆలస్యమైన ఈ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. మరికొన్ని రోజుల పాటు ఈ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యేలా లేవు. జనగణన, ఉద్యోగుల బదిలీలతో పాలనపరమైన నిర్ణయాల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో ఉండదని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. దీంతో ప్రత్యేక అధికారులే పాలన సాగించనున్నారు.తెలంగాణలో గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జులై నెల చివరి వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లేనట్లేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్న ఆశావహ అభ్యర్థులంతా మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు నెలల పాటు జనగణన ప్రక్రియ నిర్వహించడంతోపాటు.. ఉద్యోగుల బదిలీలు కూడా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు తమ విధుల్లో బిజీగా ఉండనున్నారు. దీంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెలుస్తోంది.ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనాపరమైన ప్రక్రియలతోపాటు.. విద్యా సంవత్సరం మారనున్న నేపథ్యంలో జులై నెల చివరి వరకు స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అర్థం అవుతోంది. మే, జూన్ నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణలో జనగణన ప్రక్రియను చేపట్టనుండగా.. ఈ ప్రక్రియలోనే మొత్తం అధికార యంత్రాంగం నిమగ్నం కానుంది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు తెలంగాణలో ఇంటింటి సర్వే నిర్వహించనుండటంతో జనగణన విధుల్లోనే అధికారులందరూ ఉండనున్నారు.మరోవైపు.. ఇప్పటికే మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేసింది. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొత్తం మే నెల అంతా



కొనసాగనుంది. ఆ తర్వాత మళ్లీ జూన్ 1వ తేదీ నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. అయితే ఆ లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ అసాధ్యమని స్పష్టం అవుతోంది. అదే సమయంలో జూన్ నెలలో రాష్ట్రంలో స్కూళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. అడ్మిషన్ల పెంపు, స్కూళ్లను మరింత బాగు చేయడం వంటి కార్యక్రమాలపై రాష్ట్ర విద్యా శాఖ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఇక ఉపాధ్యాయులు కూడా అడ్మిషన్ పనుల్లో బిజీగా ఉండటం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.మరోవైపు.. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికలు పూర్తి అయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో ఆశావహుల్లో ఉత్సాహం పెరిగింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు కులగణన లేదా తాజా జనగణన లెక్కలను ప్రామాణికంగా తీసుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ జనగణన ప్రక్రియ ముగియకుండా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలా వద్దా అని రాష్ట్ర ప్రభుత్వం అయోమయంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్న వివరాల ప్రకారం.. జూలై నెల చివరి నాటికి రాష్ట్రంలో జనగణన సర్వేతో పాటు ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ కూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ తర్వాత ఆగస్ట్ లేదా సెప్టెంబర్ నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే అప్పటి వరకు స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు కొనసాగనున్నాయి.

## ప్రపంచ కార్మిక దినోత్సవం "మేడే" ను బహుజన శ్రామిక వర్గ దినోత్సవంగా జరుపుకుందాం

### –బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్(బిఎల్ టీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్, సిద్దిరాములు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 29: బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిఎల్ టీయూ జిల్లా కార్యాలయం, బిఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్. సిద్దిరాములు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రపంచ కార్మిక "మేడే" దినోత్సవాన్ని బహుజన కార్మిక ఐక్యత వారోత్సవాలుగా గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకుందాం. 1886లో అమెరికాలోని చికాగో నగరం




హేమార్కెట్ లో సమావేశం ఏర్పాటు చేసుకొని8 గంటల పని దినాలు, సెలవు దినాల కోసం శాంతి యుతంగా జరుగుతున్న కార్మికుల సమావేశంపై అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడి పోలీస్ మూకలు జరిపిన కాల్పుల్లో కొంత మంది మృతిచెందారు. అనేక మంది గాయపడ్డారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన నాయకులను ఉరి తీశారు. ఆ కార్మిక పోరాట యోధుల ఆత్మబలిదానాలతో ఈరోజు ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు కనీస వేతనం కార్మిక హక్కులు సాధించబడ్డాయి. భారతదేశంలో 1884 లోనే ఆధునిక భారత సామాజిక విప్లవ నిర్మాత మహాత్మా జ్యోతి బా పూలే ఉద్యమ సహచరుడు, కామ్రేడ్ నారాయణ, మేఘాజీ లోఖండే, మొదటిసారిగా కార్మిక హక్కుల సాధన కోసం పోరాడిన తొలి భారతీయ ట్రేడ్ యూనియన్ పితామహుడిగా కార్మికోద్యమానికి పునాదులు వేశారు. కామ్రేడ్ లోఖండే ముంబైలోని టెక్స్టైల్ మిల్లుల కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించారు.ప్రపంచ కార్మిక వర్గం ఏ హక్కుల సాధన కోసం ఉద్యమించిందో కామ్రేడ్ లోఖండే నాయకత్వంలో రెండు సంవత్సరాల ముందుగానే వారానికి ఒక రోజు సెలవు (ఆదివారం సెలవు) మధ్యాహ్నం భోజన విరామం ఇవ్వాలని,సమయానికి జీతాలు చెల్లించాలని "దీనబంధు" అనే పత్రికకు సంపదాకుడిగా ఉంటూనే ఈ పత్రిక ద్వారా కార్మికుల సమస్యలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి, సమాజానికి తెలియజేశారు. ఆదివారం సెలవు కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 8 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ ఫలితంగా ఆదివారం సెలవు సాధించిన ఘనత కామ్రేడ్ లోంఖాడేదే.అమెరికా చికాగో నగరంలోని హేమార్కెట్ లో కార్మిక పోరాటానికంటే 2 సంవత్సరాల ముందే భారతదేశంలో కామ్రేడ్ నారాయణ మేఘాజీ లోఖాండే నాయకత్వంలో బొంబాయి కేంద్రంగా జరిగిన బహుజన శ్రామిక వర్గ పోరాట చరిత్రను బహుజన శ్రామిక వర్గానికి తెలియడానికి 142 సంవత్సరాలు సమయం పట్టింది. కారణం ఏమిటంటే భారతీయ చరిత్ర కారులంతా ఆధిపత్య బ్రాహ్మణులే కావడం వల్లనే.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో బహుజన కార్మిక వర్గానికి రక్షణ చట్టాలను పొందుర్చడానికి కారణం కామ్రేడ్ లోఖండే కార్మికోద్యమ చరిత్రనే స్ఫూర్తితోనే.భారతదేశంలో కార్మిక వర్గంలో 90% బహుజన శ్రామిక కులాలకు చెందిన వారుంటే.పెట్టుబడిదారుల్లో 90% ఆధిపత్య కులాలకు చెందిన అగ్రవర్ణ/అగ్రకుల వారున్నారు. భారత కార్మికోద్యమానికి నాయకత్వం వహించిన వారంతా 100% ఆధిపత్య కులాలకు చెందిన అగ్రవర్ణ/ అగ్రకుల వారే కావడం గమనార్హం.బహుజన కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అనుసరించడంలో గత కాంగ్రెస్, ప్రస్తుత బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/ అగ్రకుల పెట్టుబడిదార్ల అనుకుల ఆర్థిక చట్టాలు తెచ్చి బహుజన కార్మిక వర్గాన్ని నిలువు దోపిడి చేస్తున్నాయి.ఎందుకంటే ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/ అగ్రకుల పెట్టుబడిదార్ల ప్రతినిధులైన కాంగ్రెస్,బిజెపి, బీఆర్ఎస్, టిడిపి, వైసిపి లాంటి ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు 90% బహుజనుల ఓట్ల కొనుగోలు చేసుకోవడానికి లక్షల కోట్ల రూపాయలు ఎన్నికల ఖర్చు పేరుతో, కార్మికుల శ్రమ దోపిడి నుండి కొల్లగొట్టిన నల్ల డబ్బును ఖర్చు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత అంబానీ, ఆదాని లాంటి స్వదేశీ కార్పోరేట్ కంపెనీల తోపాటు వివిధ విదేశీ కార్పోరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం.దాంట్లో భాగంగా కార్మిక వర్గ వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ ల తోపాటు రైతు వ్యతిరేక చట్టాలను నూతన విద్యుత్ చట్టాలను తెచ్చింది.తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో బీడీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, ట్రాన్స్పోర్ట్, భవన, ఇతర నిర్మాణ, శాఫ్అండ్ ఎస్టాబ్లిష్ మెంట్,వివిధ ప్రభుత్వ శాఖల్లో బహుజన కార్మిక వర్గం దాదాపు కోటిన్నర మంది ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో మరో 60 నుండి 70 లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉంటారు. ప్రజా ప్రభుత్వమని చెప్పే రేవంత్ రెడ్డి ప్రభుత్వం బహుజన కార్మిక వర్గానికి కనీస వేతనాలు అమలు చేయడానికి కానివ్వండి సంక్షేమానికి కానివ్వండి ఎలాంటి కృషి చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో బహుజన కార్మిక వర్గ దినోత్సవంగా గ్రామ గ్రామాన ఘనంగా జరపాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్ టీయు తెలంగాణ రాష్ట్ర పిలుపునిస్తున్నది. ఈ విలేకరుల సమావేశంలో, బిఎల్ టీయూ రాష్ట్ర నాయకులు, ప్రవీణ్, కామారెడ్డి జిల్లా నాయకురాలు గంగ మణి, తదితరులు పాల్గొన్నారు.

## కిషోర బాలికలకు అవగాహన

### జగ్గయ్యపేట గ్రామంలో స్నేహ సంఘాల సమావేశం

### –ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య



రేగొండ, ఏప్రిల్ 29 (భారత శక్తి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గోరి కొత్తపల్లి మండలం జగ్గయ్యపేట గ్రామంలో కిషోర బాలికలకు స్నేహ సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య అధ్యక్షతన జరిగినది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ శాంతాదేవి మాట్లాడుతూ, అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తైన తర్వాతనే వివాహాలు జరపాలని, అంతకుముందు వివాహాలు చేస్తే చట్టపరంగా నేరమవు తుందని స్పష్టం చేశారు.అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ, సరైన పోషకాలను తీసుకోవాలని, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పరిమితంగా ఉంచాలని, తెలియని నెంబర్లతో సంభాషణలు ప్రమాదకర అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గోరి ఎస్ఐ తిలోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో అంగన్వాడి టీచర్లు రజియా బేగం, జీపీఓ సంపత్, ఏపీవో ప్రేమ్ జీ, పోలీస్ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు మరియు కిషోర బాలికలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో కిషోర బాలికలు, యువత, తల్లిదండ్రుల్లో మంచి అవగాహన పెరగాలని నిర్వాహకులు తెలిపారు.

## ప్రజా పాలన ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేర్చాలి

రేగొండ, ఏప్రిల్ 29 (భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ పాణి, ఉమ్మడి రేగొండ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోయిల క్రాంతి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వెంట వెంటనే ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ




కార్యక్రమంలో చిట్యాల మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, శాయంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సాధు నాగరాజు, ఘనపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు పోషాల మహేష్,ఉమ్మడి రేగొండ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రస ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి ముదమల్ల నరేష్, సోషల్ మీడియ ఇంచార్జ్ మొలుగూరి శ్రీను,నారాయణపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గణపాక కోటి, పోచంపల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కాడారీ అమరేందర్, యూత్ నాయకులు తనుగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు అందించాలి అనుభవం ఉన్న వారికే అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పించాలి : జేజేఏసి జిల్లా కమిటీ డిమాండ్

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (భారత శక్తి) : జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్ కార్డులు అందించాలి, 2026–28జిల్లాఅక్రిడిటేషన్ కమిటీలో అనుభవం ఉన్న సీనియర్ జర్నలిస్టులకు స్థానం కల్పించాలని ములుగు జిల్లా జర్నలిస్టు జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కలెక్టర్ హేమంత భోర్ఖడే కు బుధవారం వినతి పత్రం అందజేశారు. నూతనంగా కలెక్టర్ పదవి బాధ్యతలు చేపట్టిన హేమంత్ బోర్ఖడే సహదేవ్ రావు కు జాక్ ఆధ్వర్యంలోని జర్నలిస్టు నాయకులు కలెక్టర్ నుమర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువ తో సత్కరించారు. ఇదే సందర్భంలో ఇటీవల షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు అందుకున్న ఎనగందుల కొమురయ్య ను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జాక్ కన్వీనర్ గుర్రపు శ్రీధర్ మాట్లాడుతూ గతంలో నిజమైన పాత్రికేయులకు అన్యాయం జరుగగా ఆ సమయంలో నిజమైన పాత్రికేయులకు అక్కడే అందేందుకు అప్పటి పాలన యంత్రం అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా నిజమైన పాత్రికేయులకు అక్రిడేషన్ కార్డు అందించాలని అందరూ భావిస్తున్నప్పటికీ కొన్ని సంఘాల నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు అక్రిడేషన్ కార్డులు ఇప్పించేందుకు యూనియన్ నుండి లేఖలు తెప్పించుకొని డిపిఆరో కు సమర్పించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీలో ములుగు జిల్లాకు సంబంధంలేని ఒక వ్యక్తితో పాటు అనుభవం లేని వ్యక్తులను కమిటీలో నియమించుకొని ఇష్టానుసారంగా అర్హత లేని వ్యక్తులకు కార్డులు ఇప్పించేందుకు యూనియన్ నాయకులు





ప్రయత్నిస్తున్న క్రమంలో ములుగు జిల్లా జర్నలిస్టు జాయింట్ యాక్షన్ కమిటీ పురుడు పోసుకుంది.ఈ క్రమంలో జాక్ ఏర్పడగానే గతంలో పనిచేసిన యూనియన్ నాయకులు ఏకమై నిస్వార్థంగా పనిచేయడానికి ముందుకు వచ్చిన కొంతమంది పాత్రికేయులను తప్పుదోవ పట్టించడమే కాకుండా తమ పొరపాట్లను కప్పి పుచ్చుకోవడానికి జాక్ నాయకులపై ఆరోపణలను చేయడం వారి విజ్ఞతకే వదిలివేస్తున్నామని అన్నారు.ఇప్పటికైనా జిల్లాలోని పాత్రికేయ మిత్రులు వాస్తవాలు తెలుసుకుని ములుగు జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ లో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జినుకల ప్రభాకర్,కమిటీ వ్యవస్థాపకులు ఎనగందుల కొమురయ్య ,భేతి సతీష్,పోలోజు రామ్మూర్తి, చల్లగురుగుల రాజువర్ధన్,ఎంపెల్లి ముఖేష్, సంగ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ సిబ్బందికి వీడ్కోలు

నిజామాబాద్,ఏప్రిల్ 29( భారత శక్తి ): కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పలువురు పోలీసు అధికారులను, సిబ్బందిని బుధవారం సన్మానించారు. ఎ ఎస్ ఐ నరేందర్, హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, అఫ్సర్, కానిస్టేబుల్స్ వసుధ, చైతన్య, సర్జన్ కుమార్, నవీన్ చంద్ర, నందకిశోర్ లను ఎస్సై అనిల్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో బదిలీపై వెళ్తున్న సిబ్బంది అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావం, క్రమశిక్షణ తోటి సిబ్బందికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. కొత్త ప్రాంతాల్లో కూడా ఇలాగే



ప్రజలకు సేవలందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్సై అనిల్ రెడ్డి ఆకాంక్షించారు.

# ఉద్యోగ మేళాకు సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29(భారత శక్తి) ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువతకు ఉద్యోగ కల్పన కొరకు ఏర్పాటు చేసిన జాబ్ మేళా గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో, బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీన ఆదిలాబాద్ లో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాలో అర్హులైన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చునని అన్నారు. పోస్టర్ లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లేదా, https://satg.telangana.gov.in/prajapalana వెబ్ సైట్ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చునని అన్నారు. నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఈ గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29(భారత శక్తి)ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణా సహా పలు రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు, రవాణాను అరికట్టాలన్నారు. అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నియంత్రణ ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుక అమ్మకాలు జరగాలని అన్నారు. ఇసుక అక్రమ త్రవ్వకాలు, రవాణా నియంత్రణపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

భూభారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కు సంబంధించి ఓటర్ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఆక్విజిషన్ నాయక్వాడి జల కుమారి, సిపిఓ జీవరత్నం, ఏడి మైన్స్ హరి ప్రసాద్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహ మూర్తి, తహసిల్దార్ లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ సి ఫలితాలలో- సత్తా చాటిన నారాయణ స్కూల్



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 29: పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నారాయణ స్కూల్ విద్యార్థి సాయి శ్రేణిత్ రెడ్డి 592 మార్కులతో రాష్ట్రంలో 6 వ ర్యాంక్ సాధించారని నారాయణ స్కూల్ ఏజిఎం రమేష్ రెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ స్కూల్ నుండి పదవ తరగతి పరీక్షలకు హాజరైన 86 మంది విద్యార్థులలో 80 మంది 500 కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. 7 గురు విద్యార్థులు 580 కి పైగా మార్కులు సాధించారని, 45 మంది విద్యార్థులు 550 కు పైగా మార్కులు సాధించారని, సగటున 543 మార్కులు సాదించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పలత, శ్వేత, డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలందరికీ సరిపడా తాగునీరు అందిస్తాం: కలెక్టర్- తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) ఏప్రిల్ 29: జిల్లాలోని ప్రతి నివాస ప్రాంతంలో ప్రజల అవసరాలకు సరిపడా సమృద్ధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవిలో ఎక్కడ కూడా దాహార్తి సమస్య తలెత్తకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎం.పీ.ఓలు ఇతర అధికారులతో కలెక్టర్ మంచినీటి సరఫరా స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు.ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. రానున్న రెండు మూడు నెలలు ఎంతో కీలకమైనందున, నీటి సరఫరా విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా మరమ్మతులు చేపట్టే విషయాన్ని ప్రజలకు సైతం ముందుగానే తెలియజేస్తే వారు తగిన విధంగా సన్నద్ధం అవుతారని సూచించారు. బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, చేతి పంపులకు ఫ్లషింగ్ చేయించాలని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పట్టణాలలో తాగునీటి సరఫరాపై సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును పక్కాగా పర్యవేక్షణ జరపాలని, తాను కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఎక్కడైనా నిర్లక్ష్యానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు. మారుమూల నివాస ప్రాంతాలకు సైతం రక్షిత మంచి నీటిని అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

ఈ సమావేశంలో జడ్పి సిఇఓ శిరీష, మిషన్ భగీరథ ఈ.ఈ అరుణాకర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ శ్రీనివాసరావు, డీపీఓ యాదగిరి, అడిషనల్ డీఆర్డీఓ ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎఇఇ, ఎపిఓ, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# జలధార కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, ఏప్రిల్ 29 (భారత శక్తి ): జలధార కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల్లో నీటి భద్రతా చర్యల ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసి వంద శాతం లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సభా భవన్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళిక, అమలు పురోగతిపై డిఎఫ్ఓ వినీత్ కుమార్ తో కలిసి సంబంధిత అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, భూగర్భజల శాఖ ఇంజినీర్లు, డ్వామా ఏపీవోలతో సమీక్షించారు.

జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు

ఇప్పటికే అన్ని మండలాలకు సంబంధించి చేపట్టాల్సిన పనుల వివరాలను పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రాధాన్యతను అనుసరించి సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులను ఇప్పటికే గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో చెక్ డ్యాములు, రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు చేసి ఉంటే గుర్తించి క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా పనులను గుర్తించి నివేదికలు సమర్పించి అనుమతులు పొందాలన్నారు.

గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగింపు, చెరువులు, కాలువల అనుసంధానం, భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపేరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాస్కెట్ ట్యాంక్ లు, తాత్కాలికంగా మల్లింపు చేసిన కాలువలను గుర్తించి పునరుద్ధరణ పనులను చేపట్టాలన్నారు.

ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసి జలవనరులు శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.

కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కెఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, డ్వామా పీడి అదిశేషారెడ్డి, సీపీవో హజరతయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, మండల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యంగుల సాధికారతపై.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## – దివ్యంగులకు త్రీచక్ర స్కూటర్ల పంపిణీ

### –జిల్లా వ్యాప్తంగా 70 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.70 లక్షల విలువైన మోటరైజ్డ్ త్రీచక్ర స్కూటర్లను పంపిణీ

కడప, ఏప్రిల్ 29(భారత శక్తి ) : సమాజంలో దివ్యంగులు కూడా ఒక భాగమే అని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దివ్యంగుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, పునరావాస సేవలతో పాటు సాధికారత కోసం పాటుపడుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వ్యాప్తంగా 70 మంది దివ్యాంగులకు మంజూరైన ఉచిత మోటరైజ్డ్ స్కూటర్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యంగులు ఏ ఒక్కరూ కూడా అసంతృప్తిగా జీవితం గడపకూడదనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. అదే ఆశయంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సరికొత్త జీవితాన్ని అందించేందుకు ముందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. దేశంలోనే మొట్టమొదటి సరిగా దివ్యంగుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించి.. వారి కుటుంబాలకు ఆర్థిక సహకారం, ప్రత్యేక ఉపకరణాల చేయుతను అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 70 శాతం దివ్యాంగత ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఈ ఉచిత మోటరైజ్డ్ వాహనాల పంపిణీ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్కూటర్ల పంపిణీలో వైఎస్ఆర్ కడప జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ విజయం సదమైందన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక ఎంపిక కమిటీ ఏర్పాటు చేసి, విస్తృత ప్రచారం ద్వారా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మొత్తం 173 దరఖాస్తులు అందగా, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి, 2025 డిసెంబర్ 6న నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 70 మోటరైజ్డ్ స్కూటర్లు కేటాయించగా, రూ.70 లక్షల విలువైన ఈ వాహనాలను ఎంపికైన లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించలేని నెలకు 6 వేల రూపాయల పెన్షన్, ప్రత్యేక సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాలను కొనసాగిస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. దివ్యంగుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి జీవనోపాధి కోసం ఆర్థిక ఋణాలను కుడా మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి మాట్లాడుతూ సమాజంలో దివ్యంగులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ దివ్యంగుల అభివృద్ధి, పునరావాస సేవలతో పాటు సాధికారత కోసం పాటుపడుతున్న మొట్టమొదటి రాష్ట్ర ప్రభుత్వం మనదే అన్నారు. ఉచిత మోటరైజ్డ్ వాహనాల పంపిణీకి సంబంధించి అర్హత ప్రమాణాల ప్రకారం డిగ్రీ మరియు అంతకన్నా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, స్వయం ఉపాధి లేదా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నవారు, అలాగే కనీసం 10వ తరగతి విద్యార్హతతో ఒక సంవత్సరం ఉపాధిలో ఉన్నవారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. దివ్యాంగులు మన సోదరులు అని.. వారి జీవితాలను స్వతంత్రులుగా చేయడం, వారిని గౌరవంగా ఉంచడమే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. పేదలు, రైతులు, మహిళల సాధికారితతో పాటు దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ప్రజారవాణా వ్యవస్థల్లో దివ్యంగులకు ఉచిత రవాణా సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చడం జరిగిందన్నారు. దివ్యంగుల పునరావాసం కోసం లకుడా ఖర్చు చేయడం జరుగుతోందన్నారు.దివ్యంగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా వేలాది మందికి ప్రత్యేక ఉపాధి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పారా ఒలింపిక్స్ కొరకు దివ్యంగులను ప్రోత్సహిస్తున్నామన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో..ూా×వీజూ ఆద్వర్యంలో వేలాది శిబిరాలు ఏర్పాటు చేసి నాణ్యమైన సహాయ ఉపకరణాలను అందివ్వడం జరిగిందన్నారు. గతంలో 80% కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి మాత్రమే మోటోరైస్డ్ ట్రై సైక్కిళ్ళు అందించడం జరిగేదని ప్రస్తుతం దాన్ని 40% కు తగ్గించడం జరిగిందన్నారు. దివ్యంగుల అభివృద్ధి కోసం ఇంకా ఏదైనా మంచి చేయవచ్చో ఆలోచించి కార్యాచరణ చేపడతామన్నారు. జవాబుదారీ నాయకత్వాన్ని అందించిన ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలను అందించి.. వారి జీవన విధానాన్ని వికశింపజేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా పేద ప్రజలకు అందుతున్న విద్య, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మొదలైన అన్ని రకాల సాయాన్ని దివ్యంగులకు కూడా అందివ్వడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఉన్న దివ్యంగులు అందరూ విడతల వారీగా ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, డిసేబుల్ శాఖ ఎడి కృష్ణ కిషోర్, సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు హాజరయ్యారు.

అభిప్రాయాలు..

1) మా ఆశలకు రెక్కలొచ్చాయ్...



అలవాటు పడిన అంగ వైకల్యంతో జీవించడం ఇబ్బంది కాకపోయినా స్వతహాగా ఇంకా ఏదో చేయాలన్న మా ఆశలకు రెక్కలు వచ్చినట్లుంది. పెన్షన్ తోపాటు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోంది. జిల్లా కలెక్టర్ వారి చొరవతో మోటరైజ్డ్ వాహనాలు సరఫరా చేయడం అభినందనీయం. ఈ స్కూటర్లను సొంతం చేసుకోవడం కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నామనే ఉత్సాహాన్నిస్తోందన్నారు. ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ, లైసెన్స్ కూడా ఇచ్చి మా జీవన గమనానికి జిల్లా యంత్రాంగం వారధిగా నిలిచింది. ధన్యవాదాలు.

– ప్రభావతి(అంగన్వాడీ టీచర్), ఎర్రిపల్లె, పులివెందుల.

2) జిల్లా యంత్రాంగం సహకారం మరువలేనిది..

మా జీవితం ఇంతేలే అనే ఆలోచనలో ఉన్న మా లాంటి దివ్యంగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం కేవలం సహాయం కాదు. మాకు ఓ కొత్త జీవితాన్నిస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన నాకు ఏ పనైనా చేయగలిగే ధైర్యం ఉంది. సహకరించని శరీర అవయవాలతో అన్నింటిలోనూ వెనుకబడ్డాను. ఏ ఒక్కరికీ భారం కాకూడదని దేవుణ్ణి కోరుకునే నాకు ప్రభుత్వం అందించిన ఈ స్కూటర్ నా జీవితానికి చక్కటి దారి చూపుతుంది.

– గంగాదేవి (ఔట్సోర్సింగ్ జాబ్), ప్రొద్దుటూరు.

3) ఎవరి సహకారం లేకుండా ముందుకు సాగగలను..!

గతంలో జిల్లా కలెక్టర్ వారి చొరవతో సహాయ ఉపకరణాలు పొందాము. ఇపుడు ఉచిత మోటరైజ్డ్ వాహనం సదుపాయం ద్వారా మా జీవన గమనానికి చక్కటి దారి చూపించారు. ఇపుడు ఎవరి సహకారం లేకుండా మా కుటుంబానికి అవసరమైన అన్ని పనులు సునాయాసంగా చేసుకునే అవకాశం కలుగుతోంది. ఒకరి సహకారం లేకుండా నా పనులు స్వతహాగా చేసుకోగలనని నమ్మకం వచ్చింది. జిల్లా యంత్రాంగం కల్పించిన ఈ ఉచిత స్కూటర్ సదుపాయం మా కుటుంబానికి ఎంతో ఆసరాను అందిస్తుందని అధిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ వారికి కృతజ్ఞతలు.

– సాదక్ ఉన్నిసా (ప్రైవేట్ స్కూల్ టీచర్), తిప్పిరెడ్డిపల్లి, కమలాపురం.

4) జిల్లా యంత్రాంగం సహకారం మరువలేనిది.

ప్రభుత్వం దివ్యంగులకు అందిస్తున్న సహకారం కేవలం సహాయం కాదు. మాకు ఓ కొత్త జీవితాన్నిస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన నాకు ఏ పనైనా చేయగలిగే ధైర్యం ఉంది. అంగ వైకల్యం కారణంగా ఎన్నో అవకాశాలను కోల్పోయానని బాధ పడేవాన్ని. ప్రభుత్వం ద్వారా జిల్లా అధికారులు మాలాంటి వారి పాలిట దైవంగా మరి మోటరైజ్డ్ స్కూటర్లను ఉచితంగా అందివ్వడంతో అందరితో సమానంగా ఏ పనైనా చేయగలం అన్న ధీమా కలుగుతోంది. – ఎం. వేమారెడ్డి (టైలర్), రైల్వే కొండాపురం.

# ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు

## -నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

రేగొండ,ఏప్రిల్29(భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని సుప్రసిద్ధ



శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిలి మారుతి ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిపించగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. రేగొండ మండలంలోని కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో అయిలి మారుతి ప్రో.జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 35 జంటల సామూహిక వివాహలను లేదు మంత్రాల మధ్యన పూజాలచే ఘనంగా నిర్వహించగా, వేడుకల్లో ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర నూతన దంపతులను ఆశీర్వదిస్తూ,సమాజంలో సామూహిక వివాహాలు ఆర్థికంగా బలహీన వర్గాలకు ఎంతో ఉపయుక్తమని,ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు , అయిలి మారుతి, ఆఫీసర్ జయశంకర్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు, నగర్లో పల్లె మాజీ ఎంపీటీసీ కోణారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ ఆయిల్ మారుతి అనేక సేవా కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా వైభవంగా స్వామి వారి లక్ష తులసి అర్చన

జగిత్యాల, ఏప్రిల్ 29 (భారత శక్తి ప్రతినిధి):

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎనిమిదవ రోజు సందర్భంగా ఉదయం స్వామివారికి పురుష సూక్తం, శ్రీ సూక్తం, కల్పోక్త విధానాలు, సహస్రనామార్చన, పంచోపనిషత్తుల పారాయణంతో స్వామివారి అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో వైభవంగా జరిగింది. తదుపరి యోగ, ఉగ్ర నరసింహ స్వామి వార్లకు లక్ష తులసి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ప్రధాన అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు,అర్చకులు, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ , అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్, రాజగోపాల్ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదం స్వీకరించారు.





# పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం

## - టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 29:

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని కోల్కూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ముబారక్పూర్ స్వరూప ప్రభు ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం టీజీఐఐసీ తూర్పు నిర్మల జగ్గారెడ్డి చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే, తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ముబారక్పూర్ స్వరూప సొంత ఇల్లును కట్టుకుంటామని తాము కలలో కూడా ఊహించలేకపోయామని,తమ ఆనంద భాష్పాల ద్వారా నిర్మల జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఒగ్గు శ్రీనివాస్, సర్పంచులు మాచిరెడ్డిపల్లి మోహన్ గౌడ్, కంబాలపల్లి సర్పంచ్ ఇందూరిబాబు, నిజాంపూర్ సర్పంచ్ సత్యనారాయణ, కోల్కూర్ నాయకులు మాణిక్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ధనరాజ్, వార్డు సభ్యులు సాబీర్, సందీప్, రమేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఐఏఎస్ అధికారిణి డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి కి ఘన వీడ్కోలు

## -జిల్లా అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 29: బదిలీపై వెళ్తున్న ఐఏఎస్ అధికారిణి శ్రీమతి డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి గారికి మంగళవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా యంత్రాంగం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, డాక్టర్ కిరణ్మయి జిల్లాలో పనిచేసిన కాలంలో నిబద్ధత, అంకితభావంతో సేవలందించి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. మహిళా శిశు సంక్షేమం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఆమె తీసుకున్న చొరవ జిల్లా అభివృద్ధికి దోహదపడిందన్నారు.

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని సత్వర పరిష్కారానికి కృషి చేయడం, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేయడం ఆమె ప్రత్యేకత అని కలెక్టర్ పేర్కొన్నారు. యువ అధికారులకు ఆమె పనితీరు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ, ఇది తనకు శిక్షణ కాలమని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మార్గదర్శకత్వంలో అనేక అంశాలు నేర్చుకున్నానని తెలిపారు. కలెక్టర్ సలహాలు, సూచనలు, ప్రోత్సాహం తన వృత్తి అభివృద్ధికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు.

జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ముఖ్యంగా బాన్సువాడ ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మదు మోహన్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని డాక్టర్ కిరణ్మయి ని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



# 10 వ తరగతి 2026 ఫలితాలలో 'జయ' ప్రభంజనం



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 29: ఎస్ ఎస్ సి -2026 ఫలితాలలో జయ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారు. డి. రిత్విక స్టేట్ 2 మార్క్ 596 సాధించడంతో పాటు 11 మంది విద్యార్థులు 590 పైన మార్కులు సాధించారు. 11 మంది 590 పైన, , 61 మంది 580 ఆ పైన, 143 మంది 570 ఆ పైన, 238 మంది 560 ఆపైన, 330 మంది 550 ఆపైన, 586 మంది 500 ఆపైన మార్కులతో పాటు హాజరైన ప్రతి ముగ్గురిలో ఇద్దరు విద్యార్థులు 500 ఆ పైన మార్కులు సాధించారని కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

పాఠశాలనుండి 590 ఆపైన సాధించిన విద్యార్థులు

దాసరి రిత్విక -596, బోడ ప్రసన్న-595, కట్ట దేవి ప్రియా-594, పోతుగంటి శ్రీశ్వాస-594, బుడిగ సాన్విక- 593, తిప్పణ శ్రీజ రెడ్డి- 593, కైరోజు హేమంత్ సాయి-592, భురెడ్డి హర్షిత-591, కక్కిరేని ప్రజ్వల- 591, నిమ్మల వైశాలి- 591, తోవిటి సహస్ర- 591తో పాటు స్కూల్ అందరూ విద్యార్థులు సగటు మార్కులు 540 సాధించారు. ప్రతిభను కనబరచిన విద్యారినీ విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని మరియు సహకారం అందించిన తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

# మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

## - అడిషనల్ ఎస్పి చైతన్య రెడ్డి

### - మహిళల భద్రత--బాలల రక్షణపై విస్తృత అవగాహన



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 29: ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి యం.ఎస్.ఆర్ మెడికల్ కళాశాలలో జిల్లా పోలీసు, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్, చైల్డ్ వెల్ఫేర్ శాఖల సమన్వయంతో మహిళల భద్రత, బాలల రక్షణ, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు,ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1930, 1098 లేదా జిల్లా షీ టీమ్ నంబర్ 8712656772 ను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, "డిజిటల్ అరెస్ట్" వంటి మోసాలకు లోనుకాకూడదని, మోసపోయిన వెంటనే 1930 కు కాల్ చేయడం లేదా ఎన్ సి ఆర్ పి పోర్టల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే పోక్సో చట్టం ప్రకారం నిందితులకు కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని పేర్కొంటూ, అనుమానాస్పద సమాచారాన్ని 1908 లేదా 8712656777 నంబర్లకు తెలియజేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మహిళల భద్రత, బాలల రక్షణ అత్యంత కీలకమని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు మౌనం వీడి సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడబ్ల్యుసి సభ్యులు, వైద్య ఆరోగ్య అధికారులు, పోలీసు అధికారులు, కళాశాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# పదో తరగతి ఫలితాలలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన ములుగు జిల్లా

## - విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందికి శుభాకాంక్షలు: జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు,

ములుగు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29 (భారత శక్తి): పదో తరగతి ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేయడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి సరైన మార్గ నిర్దేశం చేస్తూ ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేసిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారికి, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. జిల్లాలో మొత్తం 3 వేల 287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3వేల 264 మంది ఉత్తీర్ణత సాధించి 99.30 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం



ఎగరవేయడం సంతోషకరమైన విషయం అని,రానున్న రోజులలో కూడా ఇదే ఫలితాలు పునరావృతం అయ్యేలా ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. ములుగు జిల్లాలో ఏటూరునాగారం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటూరు నాగారం విద్యార్థిని కె. కృష్ణ 589 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం జరిగిందని తెలిపారు.

# జనగణన-2027 పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుంది : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## -ప్రజల భాగస్వామ్యమే జిల్లా అభివృద్ధికి పునాది.

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 29: జనగణన-2027 కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్, ప్రధాన గణన అధికారి ఆశిష్ సంగ్వాన్ కలెక్టర్ ఛాంబర్లో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "మొదటి దశలో భాగంగా, స్వీయ గణన - సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఈరోజు అనగా తేది: 26-04-2026 నుండి 10-05-2026 వరకు నిర్వహించబడుతుంది. పౌరులు తమ స్వీయ గణనను అధికారిక వెబ్‌సైట్ https://se.census.gov.in ద్వారా పూర్తి చేయవచ్చు'' అని పేర్కొన్నారు. "నమోదు సమయంలో ప్రతి వ్యక్తికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య - యూనిక్ ఐడి ఇవ్వబడుతుంది. ఈ ఐడి ని గృహ గణన సమయంలో మీ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు తప్పనిసరిగా ఇవ్వాలి. మొబైల్ ఫోన్, కంప్యూటర్ ద్వారా ఎవరైనా సులభంగా నమోదు చేసుకోవచ్చు" అని వివరించారు. "జిల్లా ప్రజలందరూ నిర్ణీత గడువులోపు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వీయ గణన ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని మనవి చేస్తున్నాను. మీ భాగస్వామ్యం జిల్లాలో సమర్థవంతమైన ప్రణాళిక మరియు అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది" అని కలెక్టర్ పిలుపునిచ్చారు. "సేకరించిన సమాచారం మొత్తం కచ్చితంగా గోప్యంగా ఉంచబడుతుంది. జనగణన సమాచారం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు కీలకం. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సరైన వివరాలు నమోదు చేయాలి" అని కలెక్టర్ సూచించారు.




## ‘టాక్సిక్’ మరోసారి వాయిదా..

# యశ్ పోస్ట్

యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్’ (Toxic). దీని విడుదల మరోసారి వాయిదా పడింది. ఇది జూన్ 4న విడుదల కావాల్సి ఉండగా ఆ తేదీకి రావడం లేదని యశ్ పోస్ట్ పెట్టారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి రిలీజ్ చేయాలనే ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. ‘‘కొన్ని ప్రాజెక్టులు మనల్ని సినిమాతో ప్రేమలో పడేలా చేస్తాయి. ‘టాక్సిక్’ నాకు అలాంటి ఒక ప్రయాణమే. ఇటీవల సినిమాకాన్‌లో ఈ చిత్రానికి వచ్చిన స్పందన చూసిన తర్వాత మా నమ్మకం మరింత పెరిగింది. దీని షూటింగ్ మొత్తం పూర్తయింది. ఓవర్సీస్ హక్కుల ప్రక్రియలో ఉన్నాం. అందుకే విడుదల తేదీని మార్చాల్సి వచ్చింది. త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి విడుదలయ్యేలా కొత్త తేదీని ప్రకటిస్తాం. నటుడిగా, నిర్మాతగా భారతీయ చిత్ర పరిశ్రమ గర్వపడే లాంటి చిత్రం చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. కొన్ని కథలకు ఓపిక అవసరం. మీకు అద్భుతమైన సినిమాను అందిస్తామని మాట ఇస్తున్నా’’ అని యశ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మొదట ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయాలని భావించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూన్ 4కు వాయిదా వేశారు. ఇప్పుడు గ్లోబల్ స్థాయిలో ఒకేసారి విడుదల చేయడం కోసం మరోసారి వాయిదా వేశారు.

## అషు రెడ్డి ‘ఆడియో’ కలకలం



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డి వ్యవహారంలో కొత్త మలుపు చోటుచేసుకుంది. బాధితుడు ధర్మేంద్రను ఆమె హెచ్చరిస్తున్నట్లు ఉన్న ఓ ఆడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ధర్మేంద్ర నుంచి తీసుకున్న మొత్తంలో రూ.1.5 కోట్లను మే నెలలో తిరిగి ఇస్తానని, మిగిలిన మొత్తాన్ని తాను స్థిరపడ్డాక చెల్లిస్తానని అషు రెడ్డి పేర్కొన్నట్లు తెలుస్తోంది.



## మైసా కోసం


# రష్మిక రిస్క్

## 80 అడుగుల ఎత్తు నుంచి జంప్

పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న ‘మైసా’ కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి ‘మైసా’ డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. “రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు ‘మైసా’. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా Wవిరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయింది” అని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ , గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**సినిమా**


## రేపే థియేటర్లలోకి ధనుష్ 'కర'




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన కొత్త సినిమా ‘కర’ ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కాబోతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. 1991 గల్ఫ్ యుద్ధం నాటి పరిస్థితులు, దేశంలో ఏర్పడిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో ఈ సినిమాను పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేశారు. సినిమా నిడివి 2 గంటల 41 నిమిషాలుగా ఖరారైంది. తెలుగులో ఈ సినిమాను విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సీహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర విడుదల చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘కర’ ఒక సాధారణ వ్యక్తి అసాధారణ పరిస్థితుల్లో చిక్కుకున్న కథ అని, దర్శకుడు విఘ్నేష్ అద్భుతమైన ప్రతిభ ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## నో గ్రాఫిక్స్.. 500 లీటర్ల పెట్రోల్‌తో ‘ధురంధర్ 2’ క్లైమాక్స్

స్టార్ హీరో.. దీటుగా విలన్.. పవర్‌ఫుల్ క్లైమాక్స్.. సగటు సినీ అభిమానికి ఇంతకుమించి ఏం కావాలి. బాలీవుడ్ దర్శకుడు ఆదిత్యధర్ ‘ధురంధర్ 2’ తో ఆడియన్స్‌ను ఇలాగే థ్రిల్ చేశారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతతో పతాక సన్నివేశాలు రణరంగాన్ని తలపించాయి. భారీ పేలుళ్లతో కూడిన ఈ క్లైమాక్స్ కోసం గ్రాఫిక్స్‌పై ఆధారపడలేదని, రియలిస్ట్‌గానే రూపొందించామని స్పెషల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్ విశాల్ త్యాగి ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. దీని కోసం దాదాపు 500 లీటర్ల పెట్రోల్ వినియోగించినట్టు చెప్పారు. ‘‘ఫైర్‌తో కూడిన సన్నివేశాల కోసం గ్రాఫిక్స్‌ను వినియోగించాలనుకోవట్లేదు’ అని దర్శకుడు ఆదిత్యధర్ ముందుగానే చెప్పారు. ఆయన మాట ప్రకారమే మేం రియల్‌గా చేశాం. అన్నింటి కన్నా ఆఖరిలో వచ్చే బ్లాస్ట్‌ను రూపొందించడం చాలా కష్టంతో కూడుకున్నది. ఈ విషయంలో రణ్‌వీర్ సపోర్ట్ ఉన్నప్పటికీ.. ఆయన భద్రత విషయంలో ఆందోళన పడ్డాం. 500 లీటర్ల పెట్రోల్‌తో షూటింగ్ అంటే ఎలా ఉంటుందో ఊహించండి. పక్కా ప్రణాళికతో సెగ రణ్‌వీర్‌కు తాకకుండా మేనేజ్ చేయగలిగాం. 250 లీటర్ల ఇంధనమే వాడాలని ప్రొడక్షన్ టీమ్ సూచించింది. కానీ, సుమారు 500 లీటర్ల ఉంటేనే అవుట్‌పుట్ బాగా వస్తుందని చెప్పి, వారిని ఒప్పించా. దీంతోపాటు 25 కేజీల పేలుడు పదార్థం వాడాం. షూటింగ్ పూర్తయ్యాక.. అద్భుతమంటూ నన్ను, టీమ్‌ని రణ్‌వీర్ మెచ్చుకున్నారు’’ అంటూ విశాల్ జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. సూపర్‌హిట్ మూవీ ‘ధురంధర్’కు కొనసాగింపుగా రూపొందిన ‘ధురంధర్ 2’ మార్చిలో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ దాదాపు రూ.1800 కోట్ల వసూళ్లు రాబట్టడం విశేషం.




**జపాన్‌లో ‘ధురంధర్’**

బ్లాక్‌బస్టర్ ‘ధురంధర్’ జపాన్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. జులై 10న ఈ మూవీని జపనీస్‌లో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. గతేడాది డిసెంబరులో.. కేవలం హిందీలోనే బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ చిత్రం రూ.1300+ కోట్లు వసూలు చేయడం అరుదైన రికార్డు.

## సమంత బర్త్ డే సందడి

# పెళ్లి తర్వాత తొలి పుట్టినరోజు!

హైదరాబాద్లో అభిమానుల మధ్య స్టార్ హీరోయిన్ సమంత తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమెకు ఇది మొదటి పుట్టినరోజు కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే సమయంలో ఆమె సొంత నిర్మాణంలో వస్తున్న ‘మా ఇంటి బంగారం’ చిత్రం మే 15న విడుదలకు సిద్ధమవుతుండటంతో అటు ఫ్యాన్స్లో, ఇటు టాలీవుడ్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# జనగణనలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనండి.. పటాన్‌చెరు శాసన సభ్యులు మహిపాల్ రెడ్డి

*** జనగణనలో వివరాలు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్..**

పటాన్‌చెరు, ఏప్రిల్ 29 (భారత శక్తి) : జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్‌చెరు లోని తన నివాసంలో స్వీయ జన గణనను ప్రారంభించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి జనగణన ఎంతో కీలకమని.. ఖచ్చితమైన వివరాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం సమర్థవంతమైన సంక్షేమ పథకాలు రూపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించడం ద్వారా జనగణన ప్రక్రియ మరింత సులభతరమైందన్నారు. ప్రజలు యాప్ ద్వారా స్వీయ జనగణన సైతం చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు ఇళ్లకు వచ్చిన సమయంలో పూర్తి వివరాలు అందించాలని.. ఎటువంటి గోప్యతకు చోటు ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా బడుగు బలహీన వర్గాల జీవన స్థాయి ప్రమాణాలు, వెనుకబాటుతనం, విద్య స్థాయి, తదితర అంశాల పైన స్పష్టమైన సమాచారం లభిస్తుందన్నారు. ప్రజలు అందించే ప్రతి సమాచారం పూర్తి భద్రతతో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఏ ఆర్ ఓ అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## తిమ్మాపూర్ హై స్కూల్‌కు 96.88% ఉత్తీర్ణత

*** వెల్లివిరిసిన విద్యార్థుల ప్రతిభ**
*** అభినందించిన హెచ్‌ఎం. పెంటయ్య**



సిద్దిపేట, ఏప్రిల్ 29(భారత శక్తి) : తిమ్మాపూర్ హై స్కూల్ పదో తరగతి ఫలితాల్లో 96.88 శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలను నమోదు చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. పెంటయ్య వివరాలు వెల్లడించారు.మండల రాహుల్ 491 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించగా, జోరబొంతల శరణ్య 473 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. మార్కంటి విశాల్ 453 మార్కులతో మూడో ర్యాంక్ సాధించాడు.మొత్తం 32 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 31 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలతో పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ఈ విజయానికి విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

## గజ్వేల్ లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంబలి పంపిణీ



గజ్వేల్, ఏప్రిల్ 29(భారత శక్తి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద బుధవారం గజ్వేల్ ప్రభుత్వ పాఠశాలలో 1983 84 సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు తోట బిక్షపతి, దూబకుంట లక్ష్మణ్, గందే రమేష్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని 1983 84లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులం అందరం కలిసి గత మూడు సంవత్సరాల క్రితం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అందులో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి సంవత్సరం వేసవికాలంలో మజ్జిగ, అంబలి, పులిహోర ఇలా వివిధ కార్యక్రమాల నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ రోజు అంబలి పంపిణీ చేయడం జరిగిందని, అంబలి ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎన్ సీ శ్రీనివాస్, గంగిశెట్టి సుధాకర్, ఓబుల్, జగ్గయ్యగారి శ్రీనివాస్, గుంటుకు యాదగిరి, గౌరీశెట్టి శ్రీనివాస్, ఉప్పల వెంకటయ్య, దేశపతి శంకర్ శర్మ, దూలం వెంకటయ్య, భ్రమరాంబ, రత్నమాల, కృష్ణవేణి, శోభ, శ్రీకాంత్ రెడ్డి, దీనబంధు, వెంకట్ రెడ్డి, హరినాథ్, ధర్మారెడ్డిపల్లి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, నాగరాజు, నేతి శ్రీనివాస్, వేణుగోపాల్, నర్సింలు, రేణిగుంట శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, పెద్ది శ్రీనివాస్, చేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాందాస్ గౌడ్, భూషణం, తదితరులు పాల్గొన్నారు.



## జాలిగామలో ఉపాధి కూలీలకు రాగిజావా పంపిణీ

గజ్వేల్, ఏప్రిల్ 29(భారత శక్తి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఉపశమనం లభించింది. పెరుగుతున్న ఎండల దృష్ట్యా, ఒకటో వార్డు మెంబర్ చిట్యాల ఎల్లం ఆధ్వర్యంలో బుధవారం కూలీలకు రాగిజావా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి పనుల వద్ద కూలీల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం తమ బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్ల సునీత ఆంజనేయులు గౌడ్, ఉప సర్పంచ్ కొమురయ్య, వార్డు మెంబర్ న్యాకం మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ మాచపురం కృష్ణ, రాజలింగం, ఉపాధి హామీ కూలీలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బంగ్లా వెంకటాపూర్ లో
# పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

*** వైభవంగా పెద్దమ్మతల్లి కళ్యాణ మహోత్సవం**
*** కన్నుల పండుగగా ధ్వజస్తంభం ఏర్పాటు**





గజ్వేల్, ఏప్రిల్ 29 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు, బుధవారం ధ్వజ స్థంభం ఏర్పాటు చేశారు, అమ్మవారి కళ్యాణం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు, ఈ సందర్భంగా, ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ, పెద్దమ్మతల్లి అనుగ్రహంతో అందరూ బాగుండాలని కోరుకుంటూ, గత కొన్ని సంవత్సరాల క్రితం పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించుకొని ప్రతి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ సంవత్సరం ధ్వజస్తంభం ఏర్పాటు చేసి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, వార్షికోత్సవ వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పురోహితులు, ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, చిన్నారులు, యువకులు, బంగ్లా వెంకటా పూర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు






## జిఎన్‌ఆర్ చైతన్య కో స్కూల్
# ఎస్‌ఎస్సి ఫలితాల్లో విశిష్ట ప్రతిభ

ఎల్బీనగర్, ఏప్రిల్ 29 (భారత శక్తి): జిఎన్‌ఆర్ చైతన్య కో స్కూల్ ఎస్‌ఎస్సి బోర్డు పరీక్షల్లో మొదటి సంవత్సరంలోనే అత్యుత్తమ ఫలితాలను సాధించి, విద్యా రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పినట్లు గర్వంగా ప్రకటించింది. ఈ సంవత్సరంలో పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల సమిష్టి కృషికి నిదర్శనం.

టాప్ ర్యాంకర్లు: ఎస్.సేదిత్యా 579 మార్కులు, ఆర్. నవదీప్ 578 మార్కులు
జి. జయ ప్రకాష్ 576 మార్కులు ఎం. నీతు ప్రణతి 575 మార్కులు జె. విమల్ సాయి 573 మార్కులు కె. హంసిత 571 మార్కులు హెచ్. గాయత్రి 571 మార్కులు గణితంలో 12 మందిలో 6 మంది విద్యార్థులు 100/100 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల సంస్థ వ్యవస్థాపకులు గింజల నరేందర్ రెడ్డి విద్యార్థుల ప్రతిభపై గర్వం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఈ అద్భుత విజయానికి సంబంధించిన ప్రతి ఒక్కరికీ యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఎండల్లో దాహార్తిలకు ఉచిత మజ్జిగ పంపిణి



వనస్థలిపురం ఏప్రిల్ 30 (భారత శక్తి) సచివాలయం నగర్ రెడ్ ట్యాంక్ వద్ద దాహార్తిలకు మజ్జిగ "శ్రీ ఏ పి ఆర్ విట్టల్ ఆర్థిక సహాయంతో వనస్థలిపురం భక్త సమాజం తరపున ఏర్పాటు చేశారు ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి తెలుగుదేశం అడ్ హాక్ కమిటీ సభ్యుడు బి.యన్.రెడ్డి డివిజన్ తెలుగుదేశం కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి అయిన శ్రీ గద్దె విజయ్ నేత చేతుల మీదగా ఉచిత మజ్జిగ పంపిణీ క్యాంపు ప్రారంభం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విజయ నేత మాట్లాడుతూ ఈ వైశాఖ మాసంలో ఈ మజ్జిగ క్యాంపు నిర్వహించడం అన్నది ఒక వరము దాహార్తిలకు ఇది అందించడము ఒక పుణ్య కార్యక్రమమని సమాజ సేవ అనే దానికి ఇది ఒక ప్రత్యేక నిదర్శనమని అన్నారు. వనస్థలిపురం భక్త సమాజాన్ని కార్యవర్గ సభ్యులను అభినందించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, అశోక్, సీతారామ శర్మ, ఉమా శంకర్, కె.ఎస్.ఆర్ ఆంజనేయులు. పీసపాటి రవి శ్రీ కె.వి రత్నం,ఆర్ వెంకటేశ్వరరావు, హర్ష గ్రాఫిక్స్ శ్రీ సాయి కృష్ణ,కావ్య, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు


# పదోతరగతిలో..
## సరూర్ నగర్ గురుకుల విద్యార్థుల ప్రతిభ



ఎల్బీనగర్, ఏప్రిల్ 29 (భారత శక్తి): పదోతరగతి ఫలితాల్లో సరూర్ నగర్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మొత్తం 75 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాదించారు. డి. నిహారి 573/600, బి. అంజలి 571/600, కె. సోనీ, కె. ప్రేరణ 562/600, జి. భావన 559/600, జె. నిక్షిత 556/600 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాదించిన విద్యార్థులను ప్రిన్సిపల్ కృష్ణప్రభ ఉపాధ్యాయులు అభినందించారు.

# వధూవరులను ఆశీర్వదించిన చిగిరింత నరసింహారెడ్డి

*** ఘనంగా భగత్-వాణి వివాహ వేడుక**
*** హాజరైన రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రముఖ నేతలు**



ఎల్బీనగర్, ఏప్రిల్ 29 (భారత శక్తి) : మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన భగత్, వాణిల వివాహ వేడుకలో మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రముఖుల కలయిక**

ఈ వేడుకలో నరసింహారెడ్డితో పాటు రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు డాక్టర్ రియాజ్, బండ్రు శోభారాణి కూడా పాల్గొన్నారు. వివాహ వేదికపై వధూవరులతో కలిసి ఫొటోలు దిగిన నేతలు, వారి కొత్త జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**నేతల సాదర స్వాగతం**

కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్న చిగిరింత నరసింహారెడ్డికి, ఇతర ప్రముఖులకు చనగాని దయాకర్ సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నరసింహారెడ్డి రాకతో వివాహ వేడుకలో రాజకీయ కోలాహలం నెలకొంది.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

: **అడిషనల్ సీఈఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి**

* **సమీక్షా సమావేశంలో మండలాల అధికారులకు ఆదేశం**

బడంగ్ పేట్, ఏప్రిల్ 29 (భారత శక్తి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ ) కార్యక్రమంలో భాగంగా బుధవారం వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్, అడిషనల్ సీఈఓ తెలంగాణ, మహేశ్వరం అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించిన ఏడు మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు (AERO), 52 మంది బీఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బడంగ్ పేట్ కార్యాలయ మీటింగ్ హాల్ యందు ఈ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో, అడిషనల్ సీఈఓ మాట్లాడుతూ, 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ఓటర్లందరినీ 2002 ఓటరు జాబితాతో అనుసంధానించాలని సూచించారు. పట్టణ ప్రాంత నియోజకవర్గాలలో మ్యాపింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతుందని, బీఎల్ఓలు అందరూ ఇంటింటికి వెళ్ళి ఓటర్ల వివరాలు సేకరించి త్వరితగతిన మ్యాపింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏల సహాయం తీసుకోవాలని, రెసిడెన్షియల్ కాలనీవాసులతో సమావేశాలు నిర్వహించి అందరినీ మ్యాపింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఓటర్లందరూ కూడా సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందరూ మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. అర్బన్ ప్రాంతంలో ఎస్ఐఆర్ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోందని,బడంగ్



పేటలో 26% సరూర్నగర్ సర్కిల్లో 35% జల్ పల్లిలో 38% మాత్రమే ఓటర్ మ్యాపింగ్ ఉండడం వల్ల నియోజకవర్గ మ్యాపింగ్ శాతం కూడా చాలా తక్కువ ఉందని,కమిషనర్లు, తహసీల్దార్లు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ సీఈఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్,ఆర్ఓ మరియు ఆర్డీఓ కందుకూరు ఎన్. జగదీశ్వర్ రెడ్డి, బడంగ్ పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య జల్ పల్లి డిప్యూటీ కమిషనర్ వెంకట్రామ్, మహేశ్వరం, సరూర్నగర్, బాలాపూర్ తహసీల్దార్లు చిన్న అప్పల నాయుడు, వేణుగోపాల్,ఇందిరా దేవీ,సరూర్నగర్ సర్కిల్ సహాయ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు,కందుకూరు డిప్యూటీ తహశీల్దార్ శేఖర్,బిఎల్ఓ సూపర్వైజర్లు పలువురు బిఎల్ఓలు పాల్గొన్నారు.



## రంగారెడ్డి జిల్లా ..
# అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం

కొంగర కలాన్, ఏప్రిల్ 29 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం బుధవారం కొంగర కలాన్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ సీ. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అక్రిడేషన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) పాల్గొని, జర్నలిస్టుల అక్రిడేషన్ ప్రక్రియ, మార్గదర్శకాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేసే విధానం, అర్హతలు, పారదర్శకతపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో సాగి, తొలి మీటింగ్ విజయవంతంగా పూర్తయ్యింది. జిల్లాలో మీడియా ప్రతినిధులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు.




## పదో తరగతి ఫలితాల్లో
# కొండాపూర్ స్కూల్ విద్యార్థుల జైత్రయాత్ర

* **విద్యార్థులను అభినందించిన గ్రామ సర్పంచ్ జిగిరి అమర్, పాఠశాల యాజమాన్యం**

సిద్దిపేట, ఏప్రిల్ 29 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. ఎం. వర్ష 579 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, డి. శ్రావణి 555, లహరి 549, వి. అక్షిత 537, ఎ. అలేఖ్య 536, యు. సృజన్ 535, ఎం. దివ్య 534, మరియం ఇమామ్ 523, ఎస్. నోహా, ఎం. మణిశర్మ 511, ఆర్. సాయిలోకేష్, కె. లక్ష్మణ్ 502 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంత మంచి ఫలితాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల పట్టుదల,




తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందిస్తూ, మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జిగిరి అమర్ పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పదవ తరగతిలో అనాథ గృహ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

ఎల్బీనగర్, ఏప్రిల్ 29 (భారత శక్తి): ఆర్కేపురం చిత్రా లేఅవుట్ లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులు పదవ తరగతిలో మొత్తం 11 మందిలో అందరూ డిస్టింక్షన్,మొదటి తరగతులలో ఉత్తీర్ణత సాధించారు.ఆ విద్యార్థులు పి.గోపి 91%వి. మహేష్ 91 % ఎమ్. శ్రీవర్ 90% టి. గోవర్ధన్ 88 % పి. హర్ష 87%, ఎ.బన్నీ 83 % ఎమ్. శ్రీకర్ 81 %, యు.రాకేష్ 74 % ఎమ్. రోహిత్ 69 %, ఎ. సన్నీ 65 యు.రమేష్ 64 % మార్కులతో సత్తా చాటారు.ఈ విద్యార్థులకు ఎలాంటి ఫీజులు తీసుకోకుండా పూర్తిగా ఉచిత ప్రవేశాలు కల్పించిన, శ్రీ ఆదిత్య కాన్సెప్ట్ స్కూల్,శ్రీ విద్యా, ఎన్ఆర్ఐ, లోటస్ లాప్, న్యూ తక్షశిల, తక్షశిల పాఠశాలల యాజమాన్యాలకు అనాథ విద్యార్థి గృహం తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా 90 % పైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు,అనాథ గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ కొత్త బట్టలను బహుకరించారు.



# ముష్కిన్ చెరువులో అక్రమాలకు బ్రేక్: 10 రోజుల్లో ఖాళీ చేయాల్సిందే!







నార్సింగి, ఏప్రిల్ 29: భారత శక్తి గండిపేట మండలం నార్సింగి సమీపంలోని ముష్కిన్ చెరువు పరిరక్షణకు హైడ్రా (HYDRAA) నడుం బిగించింది. చెరువు ఎఫ్టీఎల్ (పూర్తి స్థాయి నీటి మట్టం) పరిధిలోని ఆక్రమణలపై బుధవారం అధికారులు కొరడా ఝుళిపించారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డులను, వ్యాపార సముదాయాలను పది రోజుల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పేదలను అడ్డుపెట్టుకుని భూకబ్జాలు**

చెరువు భూములను కాజేసేందుకు కొందరు కబ్జాదారులు పేదలను పావులుగా వాడుకుంటున్నారని అధికారులు గుర్తించారు. ఎఫ్టీఎల్ పరిధిలో తాత్కాలిక షెడ్డులు వేయించి, వారిని అడ్డం పెట్టుకుని బడా నిర్మాణాలు చేపట్టేందుకు వ్యూహం పన్నినట్లు నిర్ధారించారు. ఇంటింటికీ సేకరించిన చెత్తను చెరువు పరిసరాల్లోనే వేరు చేస్తూ వ్యర్థాలను నీటిలోకి వదలడం వల్ల చెరువు మురికికూపంగా మారుతోందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా హెచ్చరిస్తున్నా ఆక్రమణదారులు పట్టించుకోకపోవడంతో ఈసారి నేరుగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి గడువు విధించారు.

**లెక్క తేలింది.. 52.20 ఎకరాలు చెరువుదే!**

ముష్కిన్ చెరువు విస్తీర్ణంపై నెలకొన్న సందిగ్ధతకు హెచ్ఎండీఏ (HMDA) రికార్డుల ద్వారా స్పష్టత వచ్చింది.

* **మొత్తం ఎఫ్టీఎల్ పరిధి: 52.20 ఎకరాలు.**
  **బఫర్ జోన్ కలిపితే సుమారు 62 ఎకరాలు**

వివాదాలు: ఒక నిర్మాణ సంస్థ 18 ఎకరాలు తమదేనని వాదిస్తుండగా, మరికొందరు వ్యక్తులు మరో 16 ఎకరాలపై హక్కులు కోరుతున్నారు. సర్కారీ భూమి: సుమారు 21 ఎకరాల మేర శిఖం భూమి ఉన్నట్లు లెక్కలు తేల్చారు. చెరువులోకి వచ్చే వరద కాలువలను మూసివేసి, మట్టితో నింపి ప్రహరీ గోడలు నిర్మించేందుకు ప్రయత్నించిన బడా సంస్థల ప్రయత్నాలను అధికారులు అడ్డుకున్నారు. గతంలో నిర్మించిన అక్రమ ప్రహరీలను సైతం రెవెన్యూ యంత్రాంగం కూల్చివేసింది.

**చెరువు పునరుద్ధరణే లక్ష్యం**

ఆక్రమణలను తొలగించిన అనంతరం 52.20 ఎకరాల విస్తీర్ణంలో చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని హైడ్రా నిర్ణయించింది. చెరువు చుట్టూ బండ్ నిర్మాణం చేపట్టి, పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పనులకు అడ్డు తగిలితే ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.


**హైడ్రా చర్యలపై స్థానికుల హర్షం**

లక్షలాది మంది నివసించే ప్రాంతంలో ఉన్న ఏకైక జలవనరును కాపాడుతున్నందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కబ్జాకు గురవుతున్న వైనంపై గతంలో తాము ఫిర్యాదు చేశామని, స్పందించి తక్షణ చర్యలు తీసుకున్నందుకు ప్రభుత్వానికి, హైడ్రా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎల్బీనగర్ సర్కిల్ 13, 'నిర్లక్ష్యానికి' కేరాఫ్ అడ్రస్

: **నిబంధనలు గాలికి.. అక్రమ నిర్మాణాలకు జై!**

* **అధికారులు ఉన్నారా? లేనట్లా? సాగర్ హైవేలో యథేచ్ఛగా అక్రమ షెడ్ల నిర్మాణం.. పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం**



ఎల్బీనగర్: ఏప్రిల్ 29 (భారత శక్తి) : ఎల్బీనగర్ సర్కిల్ 13 మున్సిపల్ కార్యాలయం ప్రస్తుతం నాథుడూ లేని చందంగా తయారైంది. గత కొంతకాలంగా పూర్తిస్థాయి డిప్యూటీ కమిషనర్ లేకపోవడం, ఇంచార్జ్ పాలన సాగుతుండటంతో యంత్రాంగం పూర్తిగా స్తంభించిపోయింది. ప్రజల ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి, అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అధికారుల తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

* **సీటులో ఉండరు.. ఫోన్ ఎత్తరు: అధికారుల ఇష్టారాజ్యం!***

సర్కిల్ 13లో టౌన్ ప్లానింగ్ విభాగం తీరు అత్యంత వివాదాస్పదంగా మారింది. టౌన్ ప్లానింగ్ ఏ.సి.పి ప్రతాప్, సెక్షన్ ఆఫీసర్ అర్చన తమ విధులను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

* లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినా ఉలుకూ పలుకూ లేదు.
* కార్యాలయానికి వస్తే అధికారులు సీట్లలో ఉండరు.
* ఫోన్ చేస్తే స్పందించే కనీస బాధ్యత కూడా మృగ్యమైంది.


ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న ఈ మొండివైఖరి వెనుక అంతర్యమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**సాగర్ హైవేపై 'అక్రమ' అరాచకం**

సాగర్ హైవే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్‌లో ఎటువంటి మున్సిపల్ అనుమతులు లేకుండా భారీ షెడ్లను నిర్మిస్తున్నారు. కళ్లెదుటే ఇంత పెద్ద ఎత్తున వాణిజ్య సముదాయం వెలుస్తున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం అటువైపు చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**> మున్సిపల్ చట్టం - 2019 ప్రకారం:**

అనుమతి లేని ఏ నిర్మాణమైనా చట్టవిరుద్ధం. ప్రధాన రహదారుల పక్కన సెట్ బ్యాక్స్ (Set backs) లేకుండా నిర్మించే కట్టడాలను తక్షణమే కూల్చివేసే అధికారం మున్సిపాలిటీకి ఉంది. కానీ ఇక్కడ అధికారులు ఆ నిబంధనలను 'అక్రమ' ఆదాయం కోసం విస్మరిస్తున్నట్లు కనిపిస్తోంది.




* **నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: చట్టం ఏం చెబుతోంది?**

విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై మరియు అక్రమ నిర్మాణాలపై ఈ క్రింది చర్యలు తీసుకునే అవకాశం ఉంది:

1. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 (సెక్షన్ 178): విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు, వారిపై జరిమానా విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.
2. అక్రమ నిర్మాణాల కూల్చివేత: అనుమతి లేని నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా కూల్చివేయాలి. లేని పక్షంలో ఆ ఖర్చును యజమాని నుండే వసూలు చేయాలి.
3. సెక్షన్ 160 (పి): ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం లేదా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం 'మిస్ కండక్ట్' (Miscon duct) కిందకు వస్తుంది. దీనివల్ల సస్పెన్షన్ లేదా డిస్మిస్ అయ్యే అవకాశం ఉంది.

* **జోనల్ కమిషనర్ వికాస్ మహతోపైనే ఆశలు!**

కొత్తగా బాధ్యతలు చేపట్టిన జోనల్ కమిషనర్ వికాస్ మహతో గారు ఈ సర్కిల్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు వేడుకుంటున్నారు. స్తంభించిన యంత్రాంగాన్ని గాడిలో పెట్టాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఏ.సి.పి మరియు సెక్షన్ ఆఫీసర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు మరియు లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో రైల్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): ఇప్పటి వరకు ఎల్ అండ్ టీ ఆధీనంలో ఉన్న మెట్రో రైలును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ Iను Hyderabad Metro Rail Limited ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు ఎల్ అండ్ టీతో కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో HMRL ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, HMRL ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, L&T, LTMRHL ప్రతినిధులు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో Larsen & Toubro Limited, L&T Metro Rail (Hyderabad) Limited సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం (Share Purchase Agreement) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం LTMRHLకు ఉన్న వంద శాతం షేర్లను రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఒప్పందంపై HMRL తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, L&T Ltd తరఫున డి.కె.సేన్, LTMRHL తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ హామీతో LTMRHL పై ఉన్న రూ. 13,538.53 కోట్ల అప్పును (2026, ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేస్తారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా IDBI Capital వ్యవహరించగా, లీగల్ అడ్వైజరీ సేవలను Saraf & Partners సంస్థ అందించింది.

**ప్రయాణికులకు అనుకూలంగా..**

హైదరాబాద్‌లో L&T Metro Rail (Hyderabad) Limited సంస్థ 2017, నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-Iను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-Iను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్-I, ప్రతిపాదిత ఫేజ్-II నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, సేవల అందజేతలో సమన్వయం సాధ్యమవుతుంది. భవిష్యత్‌లోనూ హైదరాబాద్ నగరానికి మరింత సమగ్ర, ఆధారపడదగిన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

**ముఖ్యమంత్రితో ఎల్ అండ్ టీ ఛైర్మన్ భేటీ...**

ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చలు జరిగాయి.

## ఎగ్జిట్ పోల్స్ మూడు రాష్ట్రాల్లో ఉత్కంఠ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో, పలు జాతీయ సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను విడుదల చేశాయి. ఈ అంచనాలు మిశ్రమ ఫలితాలను సూచిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నువ్వానేనా అన్నట్టు పోటీ ఉండగా, తమిళనాడులో డీఎంకే కూటమి వైపు మొగ్గు కనిపిస్తోంది. కేరళలోనూ హోరాహోరీ పోరు తప్పదని సర్వేలు చెబుతున్నాయి.

*** తమిళనాడు ఎగ్జిట్ పోల్స్ (మొత్తం స్థానాలు: 234)**

తమిళనాడులో డీఎంకే కూటమి మరోసారి అధికారం చేపట్టే అవకాశాలున్నాయని చాలా సర్వేలు అంచనా వేశాయి. అయితే, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ గణనీయమైన ఓట్లను సాధించి, రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించినట్లు తెలుస్తోంది.

* పీపుల్స్ పల్స్: డీఎంకే కూటమి 125145, అన్నాడీఎంకే కూటమి 6580, టీవీకే 1824.
* మ్యాట్రిజ్: డీఎంకే కూటమి 122132, అన్నాడీఎంకే కూటమి 87100, టీవీకే 1012.
* చాణక్య స్ట్రాటజీస్: డీఎంకే కూటమి 145 160, అన్నాడీఎంకే కూటమి 5065, టీవీకే 1318.
* సీఎన్ఎన్‌న్యూస్18 సర్వే ప్రకారం, ఓట్ల శాతంలో అన్నాడీఎంకే కూటమికి 39.9 శాతంతో స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, డీఎంకే కూటమి 38.9 శాతం ఓట్లతో వెనుకబడింది. అయితే, టీవీకే పార్టీ 15.8 శాతం ఓట్లతో ఫలితాలను ప్రభావితం చేయనుంది.

*** పశ్చిమ బెంగాల్ ఎగ్జిట్ పోల్స్ (మొత్తం స్థానాలు: 294)**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపై సర్వే సంస్థల మధ్య భిన్న అంచనాలు వ్యక్తమయ్యాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని అన్ని సర్వేలు స్పష్టం చేశాయి. అయితే, ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందనే దానిపై ఏకాభిప్రాయం లేదు. కాంగ్రెస్, వామపక్షాల అవకాశాలపై స్పష్టత లేదు.

*** పీపుల్స్ పల్స్: తృణమూల్ కూటమి 177-187, బీజేపీ 95-110.**

* మ్యాట్రిజ్: బీజేపీ 146161, తృణమూల్ కూటమి 125140.
* పీమార్క్: బీజేపీ 150175, టీఎంసీ కూటమి 118138.
* ఏబీపీసీ ఓటర్: టీఎంసీ 152-164, బీజేపీ 109-121.
* ఇండియా టుడే యాక్సిస్ మై ఇండియా: బీజేపీ 134-160, టీఎంసీ 130-156.
* రిపబ్లిక్ జన్ కీ బాత్: బీజేపీ 162-185, టీఎంసీ 104-121.
* ఎన్డీటీవీ పోల్ ఆఫ్ పోల్స్: టీఎంసీ 156, బీజేపీ 121.

*** కేరళ ఎగ్జిట్ పోల్స్ (మొత్తం స్థానాలు: 140)**

కేరళలో అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ మధ్య గట్టి పోటీ నెలకొన్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు యూడీఎఫ్‌కు స్వల్ప ఆధిక్యం కనబరిచాయి.

* మ్యాట్రిజ్: యూడీఎఫ్ 7075, ఎల్డీఎఫ్ 60 65, ఎన్డీయే 35.
* ఓట్ వైబ్: యూడీఎఫ్ 7980, ఎల్డీఎఫ్ 58 68, ఎన్డీయే 04.
* పీపుల్ ఇన్ సైట్: యూడీఎఫ్ 6676, ఎల్డీఎఫ్ 5868, బీజేపీ 1014.

అంచనాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. అసలు విజేతలెవరో తెలియాలంటే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.

## తెలంగాణలో ఇంధన కొరత లేదు.. మంత్రి ఉత్తమ్ స్పష్టత

హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. దీనికి తోడు పారిశ్రామిక అవసరాలకు వాడే డీజిల్ ధర లీటరుకు రూ.150కి చేరడంతో ఆ వినియోగదారులు కూడా తక్కువ ధరకే లభించే సాధారణ బంకులపై ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో ఏపీ, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కూడా తెలంగాణలోని బంకుల్లోనే ఇంధనం నింపుతుండటంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్ముడైపోయి, బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరాను సాధారణం కంటే 126 శాతం పెంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర చమురు కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను నిరంతర సరఫరా కోసం రంగంలోకి దించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రోజువారీ డీజిల్ పంపిణీ 151 శాతం, పెట్రోల్ పంపిణీ 95 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పంట కోతలు, ధాన్యం కొనుగోళ్ల సమయం కావడంతో రైతులకు, రవాణా రంగానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల్లోని నిల్వలను సమీక్షిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

## పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు
## జూన్ 5 నుంచి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ క్రమంలో ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. టెన్త్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌తో పాటు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ వివరాలను వెల్లడించింది. అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేదీన ప్రారంభమై జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు. అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 14వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్ ఫీజు ఒక సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు ఒక సబ్జెక్టుకు రూ.1000 ఫీజు ఉంటుంది.

## గంగా ఎక్స్‌ప్రెస్‌వే యూపీ ప్రగతికి నూతన పథం

ఉత్తరప్రదేశ్, ఏప్రిల్ 29 (భారత శక్తి): ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వనాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

**ప్రాజెక్టు ముఖ్యాంశాలు**

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6లేన్ల యాక్సెస్‌కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రాలక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అనుసంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

## మోదీ హైదరాబాద్ సభకు
## 'జనాగ్రహ సభ'గా నామకరణం

హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటంచనున్నారు. కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు వస్తుండటంతో, దీనిని ఒక చారిత్రాత్మక విజయ సంకేతంగా మలిచేందుకు రాష్ట్ర బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా రాష్ట్ర బీజేపీ నేతలు నామకరణం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను (ఆగ్రహాన్ని) ఓట్లుగా మలుచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశ్యం. ఈ సభను రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించేందుకు బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3 లక్షల మందిని సభకు తరలించడం ద్వారా అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు తమ బలాన్ని చాటాలని భావిస్తున్నారు. మరోవైపు, కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, నేషనల్ హైవేల విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పనున్నారు.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం


మంగళగిరి, ఏప్రిల్ 29: తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. లోకేశ్ తో పాటు పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో కూడా చంద్రబాబు ప్రమాణం చేయించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. యువతకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూనే, అనుభవజ్ఞులైన నేతలను పొలిట్ బ్యూరోలో కొనసాగించడం ద్వారా 'పాత కొత్త' కలయికను సమర్థవంతంగా అమలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం ద్వారా, సాధారణ కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదగగలడనే బలమైన సంకేతాన్ని పార్టీ పంపింది. ఇకపై ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లోకేశ్ పాత్ర ఇప్పుడు మరింత కీలకం కాబోతోంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు కనిపిస్తోంది. పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## కవితకు టీఆర్ఎస్ షాక్.. ఈసీకి లేఖ!

హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవితకు తెలంగాణ రాజ్య సమితి (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షుడు తుపాకుల బాలరంగం షాకిచ్చారు. కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారడంతో బాలరంగం తన పార్టీని 2023లో రిజిస్టర్ చేయించారు. ఈ నేపథ్యంలో కవిత 'టీఆర్ఎస్' పార్టీని రిజిస్టర్ చేయవద్దని, అలా చేస్తే తన పార్టీకి నష్టం జరుగుతుందని ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. తన టీఆర్ఎస్ పార్టీని ఎన్నికల సంఘం 2023లో రిజిస్టర్ చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్యాస్ సిలిండర్ గుర్తుతో పది నియోజకవర్గాల్లో పోటీ చేసినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన తుపాకుల బాలరంగం 'టీఆర్ఎస్' సంక్షిప్త నామంతో పార్టీని స్థాపించారు. బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా పార్టీని స్థాపించారు. కవిత నాలుగు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. పాతికేళ్ల క్రితం కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ సంక్షిప్త నామం వచ్చేలా ఆమె పార్టీని ప్రకటించారు.

## తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల

- **2025 అక్టోబర్ వరకు ఉన్న పెండింగ్ బకాయిలు క్లియర్ చేసిన ప్రభుత్వం**
- **నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ**
- **భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం**




హైదరాబాద్, ఏప్రిల్ 29 (భారత శక్తి): తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. వారి బకాయిల కోసం వెయ్యి కోట్ల రూపాయలను విడుదల చేసింది. గత సంవత్సరం అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను క్లియర్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.1000 కోట్ల నిధులను విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల, జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం పూర్తిగా క్లియర్ చేసింది. 2025 అక్టోబర్ వరకు ఉన్న అన్ని బకాయిలను ఒకేసారి విడుదల చేసింది. ఈ బకాయిల విడుదలతో పాటు భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి నెలా చేసే చెల్లింపుల పరిమితిని మరో రూ.1,000 కోట్లకు పెంచుతూ ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. దీనితో ఉద్యోగులకు సంబంధించిన క్లెయిమ్స్, బిల్లులు ఇకపై పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే వీలుంటుంది.

## ట్రంప్ చేతిలో గన్.. ఇరాన్‌కు చెక్!

ఇక నుంచి తాను మంచివాడిగా ఉండనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటూ, తాను రైఫిల్ పట్టుకున్నట్లు ఉన్న ఫొటోను ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆ దేశానికి ఆయన మరోసారి హెచ్చరిక జారీ చేశారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని విమర్శించారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని అన్నారు. ఈ విషయంలో వారు తెలివిగా వ్యవహరిస్తే బాగుంటుందని అన్నారు. ఇక మీదట తాను అంత మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు.

# బడంగ్‌పేటలో ‘పార్క్’ మాయం.. ఆరు కోట్ల ప్రభుత్వ భూమి స్వాహా!

- బడంగ్‌పేటలో ‘పార్క్’ మాయం.. ఆరు కోట్ల ప్రభుత్వ భూమి స్వాహా!
- రాత్రికి రాత్రే వెలిసిన ప్రహరీ గోడలు.. పురాతన వృక్షాల నరికివేత
- రామిడి కళావతి, బిఎస్ఆర్ కాలనీల్లో భూ కబ్జా పర్వం
- అధికారులకు ఫిర్యాదు చేసిన రామిడి శూరకర్ణ రెడ్డి.. క్రిమినల్ చర్యలకు డిమాండ్












బడంగ్‌పేట్, ఏప్రిల్ 29 (భారత శక్తి) : అధికార గర్వం, ధనబలం తోడైతే ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. సామాన్యులకు చెందాల్సిన పార్కు స్థలాలను రియల్ మాఫియా అప్పనంగా మింగేస్తోంది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో సుమారు 6 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన ఉదంతం ఇప్పుడు స్థానికంగా సంచలనం రేపుతోంది.



BHARATEEYA JANATA YUVA MORCHA
TELANGANA

Ramidi Shura Karna Reddy
State Executive Member
Telangana
Cell : 9963693304

H.No. 2-72, Almasguda,
Badangpet Municipal Corporation,
Balapur Mandal,
Ranga Reddy Dist - 500 058.
shurakarnareddy@gmail.com
Dt. 29/04/26

శ్రీయుత గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్,
శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్-16, నాదర్‌గుల్ 57వ డివిజన్
బాలాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా గారికి నమస్కారములు

విషయము : నాదర్‌గుల్ 57వ డివిజన్ అల్మాస్‌గూడ గ్రామంలో సర్వే నెం.31,32,33,34లో పార్కు స్థలములు కబ్జా గురించి....

అయ్యా,

నాదర్‌గుల్ 57వ డివిజన్ అల్మాస్‌గూడ పరిధిలోని సర్వే నెం. 31,32,33,34 రామిడి కళావతి కాలనీ లోని (294 గజాలు), కబ్జా చేసి పురాతనమైన చింతచెట్టును కూడా కొట్టివేసి చుట్టూ ప్రహరీగోడ నిర్మించడం జరిగింది. గతంలో వెంచర్ వేసినప్పుడు ఈ స్థలంలో బావి ఉంది. బావి స్థలాన్ని పూడ్చి పార్కుగా చూయించి అక్కడ ఉన్న ప్లాట్లు అమ్మివేయడం జరిగింది. పార్కు స్థలాన్ని పట్టాదారులు ప్రస్తుతం కబ్జా చేస్తున్నారు.

బిఎస్ఆర్ కాలనీ (1001 గజాలు) ప్రభుత్వ శ్మశానవాటికకు సంబంధించిన స్థలము. ప్రభుత్వ స్థలాన్నే వెంచర్ వేసినప్పుడు పార్కుగా చూపించడం జరిగింది. దీనిని కూడా అమ్మివేయడం జరిగింది. (2 పార్కులు కలిసి మొత్తం 1295 గజాలు, సుమారు దీని విలు 6 కోట్ల రూపాయలు)

కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకొని ప్రభుత్వ అధికారులు పార్కులను మరియు ప్రభుత్వ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకొని, ప్రహరీగోడ నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడగలరని మనవి.

ఇట్లు
తమ విధేయుడు
(రామిడి శూర కర్ణ రెడ్డి)

GHMC BADANGPET CIRCLE INWARD Dt. 29/4/26

### వివరాల్లోకి వెళ్తే..

నాదర్‌గుల్ 57వ డివిజన్ పరిధిలోని అల్మాస్‌గూడ గ్రామంలో గల సర్వే నెంబర్లు 31, 32, 33, 34లలో రామిడి కళావతి కాలనీ మరియు బిఎస్ఆర్ కాలనీలు ఉన్నాయి. గతంలో వెంచర్ వేసిన సమయంలో నిబంధనల ప్రకారం పార్కుల కోసం కేటాయించిన స్థలాలను ఇప్పుడు కబ్జాదారులు తమ సొంతం చేసుకుంటున్నారు.

### మాయాజాలం ఇలా..

రామిడి కళావతి కాలనీలో 294 గజాల పార్కు స్థలాన్ని కబ్జా చేసిన దుండగులు, అక్కడ ఉన్న పురాతన చింతచెట్టును సైతం నిర్దాక్షిణ్యంగా నరికివేశారు. గతంలో ఇక్కడ ఒక బావి ఉండేదని, వెంచర్ ప్లాట్లు అమ్మే సమయంలో దీనిని పార్కుగా చూపించి ప్రజలను నమ్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు అదే స్థలాన్ని పట్టాదారులుగా చెప్పుకుంటూ కొందరు రాత్రికి రాత్రే ప్రహరీ గోడలు నిర్మించి ఆక్రమించుకున్నారు. మరోవైపు, బిఎస్ఆర్ కాలనీలో ప్రభుత్వ శ్మశానవాటికకు కేటాయించిన 1001 గజాల స్థలాన్ని సైతం వదలకుండా కబ్జా చేశారు. మొత్తం 1295 గజాల ఈ భారీ భూభాగాన్ని కబ్జాదారులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### పోరాట బాటలో శూరకర్ణ రెడ్డి:

ఈ అక్రమ కబ్జాలపై భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామిడి శూరకర్ణ రెడ్డి గళమెత్తారు. బుధవారం బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ప్రజలకు చెందాల్సిన ఆరు కోట్ల విలువైన ఆస్తులను కబ్జా చేస్తున్న వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### అధికారుల హామీ:

ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ కట్టడాలను తొలగిస్తామని, ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. కబ్జాకు గురైన పార్కులను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే వరకు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తన పోరాటం ఆగదని ఈ సందర్భంగా శూరకర్ణ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులకు అండగా ఉంటూ పార్కు స్థలాల రక్షణ కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధమని ఆయన ప్రకటించారు.

# ‘పోలీస్ బాస్ ఆనంద్ -శాంతిభద్రతల వారధి.. సంస్కరణల సారధి’





- సవాళ్లే ఆయనకు సోపానాలు
- మైదానం నుంచి డీజీపీ పీఠం వరకు
- సీవీ ఆనంద్ ప్రస్థానంపై ప్రత్యేక కథనం

హైదరాబాద్, ఏప్రిల్ 29 : భారత శక్తి,
అతడు మైదానంలోకి దిగి బ్యాట్ ఝూలిపించాడంటే పరుగుల వరద.. ఖాకీ దుస్తులు ధరిస్తే నేరగాళ్ల గుండెల్లో వణుకు.. పరిపాలన పగ్గాలు చేపడితే రూ.వేల కోట్ల ప్రజాధనానికి రక్షణ. తెలంగాణ రాష్ట్ర నూతన పోలీస్ బాస్ (డీజీపీ)గా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ అంటే కేవలం ఒక పేరు కాదు. అదొక నిరంతర సంస్కరణల ప్రవాహం. అంతే కాదు అదొక బ్రాండ్. హైదరాబాద్ గల్లీల నుంచి రాష్ట్ర పోలీస్ అత్యున్నత శిఖరం వరకు ఆయన సాగించిన ప్రయాణం అసాధారణం, స్ఫూర్తిదాయకం.

### విషాదం నుంచి విస్ఫోటనం..

సీవీ ఆనంద్ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన కుటుంబ నేపథ్యాన్ని చూడాలి. ఐఎఫ్ఎస్ అధికారి సి.దామోదర్ రెడ్డి కుమారుడిగా క్రమశిక్షణతో పెరిగిన ఆనంద్ జీవితంలో ఒక మలుపు ఆయన అన్నయ్య వినోద్ మరణం. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా ఉంటూ మిగ్ విమాన ప్రమాదంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సోదరుడి వీరత్వం, ఆనంద్ లో బలమైన దేశభక్తిని నింపింది. క్రికెట్ మీద మక్కువ ఉన్నా, సోదరుడి బాటలో దేశానికి సేవ చేయాలనే పట్టుదలతో ఐపీఎస్ వైపు అడుగులు వేశారు. కేవలం 22 ఏళ్లకే, తొలి ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించి తన లక్ష్యాన్ని ముద్దాడారు.

### బ్యాట్ పడితే బాదుడే..

ఆయన ఒక అరుదైన ‘స్పోర్ట్స్ పోలీస్’. నిజాం కాలేజీలో చదువుతున్నప్పుడు స్టార్ క్రికెటర్‌గా వెలిగారు. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన అండర్ 19 జట్టులో సభ్యుడు. ఆ క్రీడా స్ఫూర్తే ఆయనను విధి నిర్వహణలోనూ వేగంగా నిర్ణయాలు తీసుకునేలా చేస్తోంది.

### గన్ పాయింట్....

వరంగల్, అదిలాబాద్ అడవుల్లో నక్సల్స్‌తో ముఖాముఖి తలపడిన ధైర్యశాలి. మెడల్స్ విషయానికి వస్తే...ప్రాణాలకు తెగించి పోరాడినందుకు గాను 2002లో ‘రాష్ట్రపతి గ్యాలంట్రీ మెడల్’ ఆయన ధైర్యానికి నిదర్శనం.

### పరిశోధనాత్మక విశ్లేషణ...

ఒక పోలీస్ అధికారి కేవలం లా అండ్ ఆర్డర్ మాత్రమే చూస్తారనే అపోహను ఆయన పటాపంచలు చేశారు.

1 .పౌర సరఫరాల శాఖలో ఆయన ప్రవేశపెట్టిన టెక్నాలజీ (ePoS) ద్వారా అక్రమ రవాణాకు చెక్ పడింది. తద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.2,000 కోట్లు ఆదా కావడం ఒక రికార్డు.

2. ట్రాఫిక్ సంస్కరణలను పరిశీలిస్తే...ఈ రోజు మనం చూస్తున్న ‘డ్రంక్ అండ్ డ్రైవ్’ తనిఖీలు, ఈచలాన్ల వెనుక ఉన్న అసలు మాస్టర్ మైండ్ ఆనంద్ గారే.

3. హెచ్ న్యూ (HNEW)లో భాగంగా హైదరాబాద్ సీపీగా డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో తొలగించేందుకు ఆయన వేసిన ప్లాన్ నేడు దేశవ్యాప్తంగా మోడల్ గా నిలిచింది.

- **కుటుంబం.. వ్యక్తిత్వం: నిరాడంబర నిశ్చలత్వం**
- ఆయన భార్య లలిత ఆనంద్ విద్యావేత్తగా తనదైన గుర్తింపు పొందగా, కుమారుడు చామ మిలింద్ క్రికెట్‌లో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ రంజీ ప్లేయర్‌గా ఎదిగారు. వృత్తిలో ఎంత కఠినంగా ఉంటారో, వ్యక్తిగతంగా అంత నిరాడంబరంగా ఉండటం ఆయన ప్రత్యేకత. ఐటీ కారిడార్‌లో మహిళల భద్రత కోసం ‘షీ షటిల్స్’ ప్రారంభించినా, సైబర్ నేరగాళ్ల ఆట కట్టించినా ఆయన విజన్ ఎప్పుడూ భవిష్యత్తు వైపే ఉంటుంది.

### ముందున్న లక్ష్యం: స్మార్ట్ పోలీసింగ్

తెలంగాణ డీజీపీగా ఇప్పుడు ఆయన ముందు ఏఐ (AI), సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సవాళ్లు ఉన్నాయి. తన సుదీర్ఘ అనుభవంతో, క్రీడాకారుడి వేగంతో రాష్ట్ర రక్షణ వ్యవస్థను ఆయన మరో మెట్టు ఎక్కించనున్నారని పోలీస్ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయనో నిఘా నేత్రం.. సంస్కరణల అమలులో ఒక ఉప్పెన..సీవీ ఆనంద్ ది పీపుల్స్ పోలీస్!




# అల్మాస్ గూడ ప్రధాన రహదారి విస్తరణ పనులకు మోక్షం

- నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలి: రాఘవేందర్ రెడ్డి
- క్షేత్రస్థాయిలో పరిశీలించి హామీ ఇచ్చిన బడంగ్‌పేట్ డీసీ సమ్మయ్య

బడంగ్‌పేట్, ఏప్రిల్ 29: మహేశ్వరం నియోజకవర్గం నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని అల్మాస్ గూడ శివాజీ చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఉన్న ప్రధాన రహదారి సమస్య పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ రహదారి అత్యంత ఇరుకుగా ఉండటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని ఏబీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలోనే పనులు ప్రారంభమైనప్పటికీ మధ్యలోనే నిలిచిపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.

### క్షేత్రస్థాయిలో పరిశీలన

రాఘవేందర్ రెడ్డి ఫిర్యాదుపై బడంగ్‌పేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య బుధవారం ఆ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించారు. రహదారి పరిస్థితిని,



ట్రాఫిక్ ఇబ్బందులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిలిచిపోయిన విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

### డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వినతి

రహదారి సమస్యతో పాటు పలు కాలనీల్లోని డ్రైనేజీ ఇబ్బందులను కూడా అధికారులు గుర్తించారు.

- సౌభాగ్య నగర్, స్వేచ్ఛ నివాస్
- వినాయక హిల్స్, శ్రీ శ్రీ హోమ్స్
- జయశంకర్ కాలనీ

ఈ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ సమస్యలను రాఘవేందర్ రెడ్డి అధికారులకు వివరించారు. వీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని శానిటేషన్ డీఈ అభినవ్ పేర్కొన్నారు.

### కోమటికుంట చెరువు సుందరీకరణ

కోమటికుంట చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించాలని డీసీ అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాలను శుభ్రం చేసి, స్థానిక ప్రజల కోసం వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీను ధనావత్, బాలాజీ రావు, వెంకట్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, పొనుగోటి రావు, సామయ్య, యాదయ్య, లక్ష్మణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# హామీల ‘మహాలక్ష్మి’కి అందని మోక్షం..

- అగమ్యగోచరంగా మహిళా సంక్షేమం!*
- కాంగ్రెస్ వైఫల్యాలపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజం
- కందుకూరులో 257 మందికి కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- అరిచేతిలో వైకుంఠం చూపి కాలయాపన చేస్తోందని విమర్శ





బాలాపూర్, ఏప్రిల్ 29: ఎన్నికల వేళ మహిళా లోకానికి ఆకాశమే హద్దుగా హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక ఆచరణలో మాత్రం అడుగు ముందుకు వేయడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం కందుకూరు మండల కేంద్రంలో అర్హులైన 257 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై ఆమె నిప్పులు చెరిగారు.

### శూన్యహస్తం.. సందిగ్ధంలో సంక్షేమం!

రాష్ట్రంలో పాలన పూర్తిగా స్తంభించిందని, కేవలం మాటల గారడీతోనే కాలం వెళ్లదీస్తున్నారని సబిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంధించిన ప్రధాన విమర్శలివే:

కోటీశ్వరుల హామీ ఏమైంది?: “రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికారు. ఇప్పటి వరకు ఎంతమందిని ఆ స్థాయికి చేర్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి.”

### అమలుకు నోచని అభయహస్తం:

నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పిన మహాలక్ష్మి పథకం ఎక్కడికి పోయిందని ఆమె ప్రశ్నించారు. గృహజ్యోతి, రూ. 500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో మహిళలు మోసపోయామని భావిస్తున్నారని పేర్కొన్నారు. ఆగిపోయిన అభివృద్ధి చక్రం: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులకు నిధులు విడుదల చేయకుండా, కొత్త పనులు చేపట్టకుండా అభివృద్ధిని అటకెక్కించారని మండిపడ్డారు.

> రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP) మరియు అప్పుల పరిమితి (FRBM పరిమితులు) దృష్ట్యా, కాంగ్రెస్ ప్రకటించిన ‘ఆరు గ్యారంటీలకు’ దాదాపు రూ. 1.25 లక్షల కోట్లు అవసరమని ఆర్థిక నిపుణుల అంచనా. అయితే, బడ్జెట్ కేటాయింపులు ఆ స్థాయిలో లేకపోవడమే ఈ పథకాల అమలులో జాప్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

### అభివృద్ధి నిలిచి.. ఆరోపణలు పెరిగి..

“ప్రజలకు అరిచేతిలో వైకుంఠం చూపి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, నేడు పాలనను గాలికి వదిలేసింది” అని సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు మండలంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చెక్కుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని లబ్ధిదారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మొత్తానికి, అధికార పక్షం ఇచ్చే హామీలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అమలుకు మధ్య ఉన్న అగాధాన్ని సబితా ఇంద్రారెడ్డి తన పర్యటన ద్వారా ఎండగట్టారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.